# సూర్య ఉదయం
ప్రతి పదం... ప్రజా శ్రేయస్కరం
తెలుగు దిన పత్రిక



విలేకరులు కావలెను
సూర్య ఉదయం తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర పదేశ్ ,తెలంగాణలో అన్ని నియోజకవర్గ, కేంద్రాలలో అసక్తి గల విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడునుపూర్తి వివరాలకు సంప్రదించండి.
ఐడి కార్డు ఉచితం
యం.సునిల్ కుమార్
సూర్య ఉదయం తెలుగు దిన పత్రిక ఎడిటర్
సెల్ : 08512 254632



ఎడిటర్ : యం. సునీల్ కుమార్ సంపుటి : 08 సంచిక : 254 ఆదివారం 06 - 09 - 2026 పేజిలు : 08 వెల రూ. 2 రూ/

Published From Kurnool : Circulated at VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam,Chittoor, Kurnool, Kadapa, Anantapuram, Hyderabad




## సీఎం చంద్రబాబుకు రఘువీరారెడ్డి లేఖ

- జీవో 102 రద్దుపై కీలక విజ్ఞప్తి
- ముఖ్యమంత్రి చంద్రబాబుకు కాంగ్రెస్ సీనియర్ నేత రఘువీరా రెడ్డి లేఖ
- మెడికల్ అడ్మిషన్లలో 'ఆల్ ఆప్షన్స్' రద్దు చేస్తూ ఇచ్చిన జీవో 102పై ఆందోళన
- ఈ జీవోతో 70 మంది రిజర్వ్ కేటగిరీ మెరిట్ విద్యార్థులకు అన్యాయం జరిగిందని ఆరోపణ
- జీవో 102ను రద్దు చేసి, పాత జీవో 151ని కొనసాగించాలని ప్రభుత్వానికి వినతి

**అమరావతి :**

రాష్ట్రంలో వైద్య విద్య ప్రవేశాలకు సంబంధించి ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నెం. 102పై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఎన్. రఘువీరారెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన శనివారం ఒక లేఖ రాశారు. మెడికల్ - మిగతా 2 లో

# ఉద్యోగులకు తీపి కబురు

- ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 12వ పీఆర్సీకి గ్రీన్ సిగ్నల్
- సంబరాల్లో ఉద్యోగ సంఘాలు
- సీఎం చంద్రబాబుతో సానుకూలంగా ముగిసిన ఉద్యోగ సంఘాల చర్చలు
- పలు కీలక డిమాండ్లకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం
- అక్టోబర్ 1 నుంచి రెండు డీఏలు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకారం
- సరెండర్ లీవులు, జనవరిలో ఇవ్వాలని నిర్ణయం
- అదనపు పెన్షన్ క్వాంటంపై కీలక నిర్ణయం
- ప్రభుత్వంపై ఏటా రూ. 2880 కోట్ల అదనపు భారం



**అమరావతి :**

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ ఉద్యోగులకు తీపి కబురు అందించారు. ఆర్థికంగా ఊరటనిచ్చే పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రెండు డీఏలను అక్టోబర్ 1 నుంచి చెల్లించడంతో పాటు పీఆర్సీ ఛైర్మన్ నియామకానికి సీఎం అంగీకరించారు. ఒక సరెండర్ లీవ్, పోలీసులకు అదనంగా మరో సరెండర్ లీవ్ బకాయిల చెల్లింపునకు సరేనన్నారు. పెన్షనర్లకు అదనపు క్వాంటం ఆఫ్ పెన్షన్, ఉద్యోగుల హెల్త్ స్కీమ్‌ను క్రమబద్ధీకరించేందుకు నిర్ణయాలు తీసుకున్నారు. సీఎం నిర్ణయాల పట్ల ఉద్యోగ సంఘాల నేతలు ధన్యవాదాలు తెలియజేశాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గుర్తింపు పొందిన 11 ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో - మిగతా 2 లో

## 2029 నాటికి మరో మూడు డీఎస్సీలు



- మంత్రి నారా లోకేశ్ ప్రకటన
- విజయవాడలో ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం
- హాజరైన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- వచ్చే ఏడాది ఏప్రిల్ లోపు వర్సిటీల్లో ఫ్యాకల్టీ నియామకాలు పూర్తి
- వివాదాస్పద జీవో 117 రద్దు, పారదర్శక బదిలీలతో ఉపాధ్యాయులకు న్యాయం

**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్‌లో విద్యావ్యవస్థను దేశంలోనే అగ్రగామిగా నిలపడమే లక్ష్యమని, అందుకోసం తమ - మిగతా 2 లో



## ఢిల్లీని ముంచెత్తిన భారీ వర్షం

- రెడ్ అలర్ట్ జారీ!
- ఢిల్లీ-ఎన్‌సీఆర్‌ను ముంచెత్తిన భారీ వర్షాలు
- వాతావరణ శాఖ నుంచి రెడ్ అలర్ట్ జారీ
- లోతట్టు ప్రాంతాలు జలమయం, విమాన సేవలకు అంతరాయం
- ప్రయాణికులు ముందుగానే విమాన వివరాలు చూసుకోవాలని సూచన

దేశ రాజధాని ఢిల్లీతో పాటు దాని పరిసర ప్రాంతాలను (ఎన్‌సీఆర్) శనివారం ఉదయం కూడా కుండపోత వర్షం ముంచెత్తింది. భారీ వర్షాల కారణంగా అనేక ప్రాంతాలు జలమయమవడంతో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఢిల్లీకి 'రెడ్ అలర్ట్' జారీ - మిగతా 2 లో

## గ్లోబల్ లీడర్లలో మోదీ అత్యంత స్ఫూర్తిదాయకం



- బెల్జియం ప్రధాని ప్రశంసల వర్షం
- మోదీ తెలివైన నాయకుడన్న బార్ట్ డె వెవర్
- మోదీతో భేటీ కావడం తనకు లభించిన గౌరవమని వ్యాఖ్య
- విశ్వవేదికపై భారత్ పాత్ర కీలకంగా మారిందన్న బెల్జియం ప్రధాని

**ఢిల్లీ :**

ప్రపంచ రాజకీయాల్లో తీవ్ర అస్థిరత, భౌగోళిక ఉద్రిక్తతలు నెలకొన్న ప్రస్తుత తరుణంలో భారత ప్రధాని మోదీ అనుసరిస్తున్న దౌత్య విధానాలు, నాయకత్వ పటిమపై బెల్జియం ప్రధాని బార్ట్ డె వెవర్ ప్రశంసలు కురిపించారు. ప్రపంచంలోని అత్యంత స్ఫూర్తిదాయకమైన, తెలివైన నేతల్లో మోదీ అగ్రగామి అని అభివర్ణించిన ఆయన... మోదీతో భేటీ కావడం తనకు లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచంలోని పలువురు అగ్రనేతల ప్రసంగాలు విన్నప్పుడు ఆందోళన, అభద్రతా భావం కలుగుతాయని... కానీ ప్రధాని మోదీ మాట్లాడితే ఆయన చెప్పిన దార్శనికతను అనుసరించాలనే నమ్మకం, స్ఫూర్తి కలుగుతాయని వ్యాఖ్యానించారు. విశ్వవేదికపై భారత్ పాత్ర అత్యంత కీలకంగా మారిందని కొనియాడిన బెల్జియం ప్రధాని - మిగతా 2 లో

## ఇక ప్రపంచ పటం మారనుందా

- ఐక్యరాజ్య సమితిలో కీలక తీర్మానం
- కొత్త ప్రపంచ పటానికి యూఎన్ఓ ఆమోదం
- 164 దేశాలు తీర్మానానికి అనుకూలం
- అమెరికా మాత్రమే వ్యతిరేకంగా ఓటు
- కొత్త పటంలో పెద్దగా కనిపించనున్న ఆఫ్రికా
- ఈక్వల్ ఎర్త్ ప్రొజెక్షన్‌కు ప్రోత్సాహం



**ఢిల్లీ :**

ప్రపంచ పటాన్ని చూడగానే ఆఫ్రికా కంటే యూరప్, ఉత్తర అమెరికా పెద్దవిగా కనిపిస్తాయి. కానీ వాస్తవ

## ముదురుతున్న యుద్ధ మేఘాలు

- సౌదీ అరేబియాకు ఆయుధాల విక్రయానికి అమెరికా గ్రీన్ సిగ్నల్
- ఇరాన్, హూతీ రెబెల్స్ నుంచి సౌదీకి నిరంతరం ఎదురవుతున్న దాడులు
- సౌదీ రక్షణ సామర్థ్యాన్ని బలోపేతం చేసే దిశగా అమెరికా నిర్ణయం



**ఢిల్లీ :**

ఇరాన్‌తో ఉద్రిక్తతలు, ప్రాంతీయ పోరాటాలు పరాకాష్టకు చేరిన తరుణంలో, గల్ఫ్ - మిగతా 2 లో

## సింధు నదిపై భారత్ కొత్త ప్లాన్!

2 లో..

- పాక్‌కు గట్టి సంకేతం
- సింధు నదిపై భారత్ తొలి రాక్ చెక్ డ్యామ్
- లడఖ్ లోని ఉప్షి వద్ద నిర్మాణం
- దాదాపు 10 అడుగులు పెరిగిన నీటి మట్టం
- డ్యామ్‌లో 4 కోట్ల లీటర్ల నీటి నిల్వ
- ఇగూ ఫే కాలువ ద్వారా పొలాలకు నీరు

## అది విద్యా వ్యవస్థా లేక కార్పొరేట్ దోపిడీ వ్యవస్థా?



- ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల మోతపై రేవంత్‌ను నిలదీసిన కవిత
- ప్రైవేట్ స్కూళ్లు విచ్చలవిడిగా దోచుకుంటున్నాయని కవిత ఆగ్రహం
- స్కూళ్ల ఫీజుల కట్టడికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని మండిపాటు
- విద్యార్థుల తల్లిదండ్రుల జేబులు గుల్లవుతున్నా రేవంత్ మౌనం వహిస్తున్నారన్న కవిత

**హైదరాబాద్ :**

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా సాగుతున్న ఫీజుల దోపిడీపై కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విద్యా సంవత్సరం ప్రారంభమై - మిగతా 2 లో



## లక్కీ లాటరీ సీఎం రేవంత్‌ను కూల్చే రోజులు త్వరలోనే ఉన్నాయి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రేవంత్ ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ అన్న కేటీఆర్
- 420 మోసాలకు గాను రేవంత్ 420 సార్లు రాజీనామా చేయాలని డిమాండ్
- మంత్రులు కమీషన్ల కోసం కొట్టుకుంటున్నారని ఆరోపణ

**హైదరాబాద్ :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో - మిగతా 2 లో

# హైదరాబాద్‌లో అతిపెద్ద ఏఐ డేటా సెంటర్



- టీసీఎస్ రూ.70వేల కోట్ల పెట్టుబడి
- హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుచేయనున్న టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్ వాల్ట్
- 7 వేల మందికి ఉపాధి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కీలక సమావేశం
- హైదరాబాద్‌లో 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో 1 గిగావాట్ (1,000 మెగావాట్లు) సామర్థ్యంతో ఈ అత్యాధునిక ఏఐ డేటా సెంటర్ క్యాంపస్
- గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో క్యాంపస్

**హైదరాబాద్ :**

హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్ వాల్ట్ ప్రకటించింది. అందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సచివాలయంలో టీసీఎస్ హైపర్ వాల్ట్ ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో శనివారం సమావేశమైంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతోపాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. టీసీఎస్ సీఈఓ కె.కృతివాసన్, సీవోవో ఆర్తి సుబ్రమణియన్, హైపర్ వాల్ట్ ప్రెసిడెంట్ వి.రాజన్న, హైపర్ వాల్ట్ సీఈఓ, ఎండీ దీపేష్ నందా సమావేశంలో పాల్గొన్నారు. అమెరికా నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓపెన్ ఏఐ చీఫ్ - మిగతా 2 లో

సూర్య ఉదయం
తెలుగు దిన పత్రిక
ఆదివారం 06 - 09 - 2026

# సంపాదకీయం

## ప్రమాద ఘంటికలు

ఎంతసేపూ అభివృద్ధి, లాభార్జన, ఆర్థికప్రగతి గురించి మాత్రమే హోరెత్తే ప్రపంచంలో వాతావరణం ఎలావుందో, అది ముమ్మందు ఎలా పరిణమిస్తుందో హెచ్చరించే సంస్థలు కూడా ఉన్నాయి. పరుగులు ఆపి సరిచూసుకోనట్టయితే ఈ భూగోళమే పెను ప్రమాదంలో పడుతుందని ఆ సంస్థలు మరోసారి హెచ్చరించాయి. ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యూఎంఓ), ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం(యూఎన్ఈపీ)లు ఒకరోజు తేడాలో తమ నివేదికలు విడుదల చేశాయి. 'అత్యంత బలమైన' ఎల్‌నినో విరుచుకుపడటం, అది వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకూ కొనసాగటం తథ్యమని డబ్ల్యూఎంఓ చెబుతోంది. అందువల్ల ఉష్ణోగ్రతల్లో తీవ్ర మార్పులు చోటుచేసుకోవటంతోపాటు వర్షాభావ పరిస్థితులు ఏర్పడి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆ సంస్థ వివరించింది. ఈ దశాబ్దం చివరినాటికి ప్రపంచ ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీల సెల్సియస్ దాటే అవకాశం ఉందని యూఎన్ఈపీసంస్థ హెచ్చరించింది. ప్రభుత్వాల విధానాలు ఇప్పుడున్న విధంగానే కొనసాగితే2100 నాటికి ఉష్ణోగ్రతలు 2.6 డిగ్రీల సెల్సియస్ మేర పెరుగుతుందని అది జోస్యం చెప్పింది.కానీ పారిస్ ఒప్పందంలో పూచీపడిన విధంగా ప్రభుత్వాలు కర్బన ఉద్గారాలు తగ్గించుకుంటే అది 1.8 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితమయ్యే అవకాశం లేకపోలేదని వివరించింది. ఈ రెండు సంస్థలూ చెప్పాయని కాదు... రాబోయే రోజులెలా ఉండబోతు న్నాయో ప్రస్తుత పరిస్థితులే చెబుతున్నాయి. ఇటీవల నేపాల్‌లో వచ్చిన మెరుపు వరదల వల్ల దాదాపు 1,300 మంది చనిపోగా, అనేకులు ఆచూకీ లేకుండా పోయారు. ఊళ్లకు ఊళ్లు తుడిచిపెట్టుకుపోయాయి. కనీవినీ ఎరుగని విధ్వంసం చోటుచేసుకుంది.పర్యావరణ పరిరక్షణతో సమస్త జీవుల మనుగడ ముడిపడివుందని ప్రపంచంగ్రహించి దాదాపు అరవయ్యేళ్లవుతోంది. కానీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వంటి పాలకుల పుణ్యమా అని ఇప్పటికీ వివాదాస్పద అంశంగానే ఉంటోంది. పర్యావరణ ధ్వంసం అమెరికా అభివృద్ధి గిట్టనివారి సృష్టి అని ఆయన అభిప్రాయం. తమ ప్రయోజనాలకు విఘాతం కల్గిస్తుందంటూ ఏకంగా పారిస్ ఒప్పందం నుంచి నిష్క్రమించారు. విషాదమేమంటే ఆ ఒప్పందంలో కొనసాగుతూ కూడా, దాని లక్ష్యాలను విస్మరిస్తున్న దేశాలున్నాయి.అభివృద్ధి పేరిట ఇష్టానుసారం ప్రాజెక్టులకు అనుమతు లీయటంవల్ల పర్యావరణం దెబ్బతింటోందని, కాలుష్యం పెరుగుతున్నదని పర్యావరణ ఉద్యమకారులు వాదిస్తుంటే... మరి అభివృద్ధి మాటేమిటన్నది ప్రభుత్వాల ప్రశ్న. పారిశ్రామిక విప్లవంకంటే ముందునాటి ఉష్ణోగ్రతలతో పోలిస్తే 2030 నాటికి సగటు ఉష్ణోగ్రత పెరుగుదల కనీసం 1.5 డిగ్రీల సెల్సియస్ లోపులో ఉంచాలని, ఎట్టిపరిస్థితు ల్లోనూ అది 2 డిగ్రీలు దాటరాదని పారిస్ ఒప్పందం నిర్దేశించింది. ఇందుకోసం గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలను 42 శాతం మేర తగ్గించాలి. కానీ ప్రపంచవ్యాప్తంగా దేశాలు పాటిస్తున్న విధానాలేవీ దానికి అనుగుణంగా లేవు. అందువల్లే ధ్రువప్రాంతాల్లో వేగంగా మంచు కరగడం, సముద్ర మట్టాలు పెరగడం, పెను తుపానులు, కరువుకాటకాలు, అత్యధిక ఉష్ణోగ్రతలు సర్వసాధారణమయ్యాయి.చారిత్రకంగా చూస్తే 1850 నుంచి ఇంతవరకూ 25 శాతం ఉద్గారాలతో అమెరికా ప్రథమ స్థానంలో ఉంటే దాదాపు 22 శాతం వాటాతో యూరప్ దేశాలు, దాదాపు 7 శాతంతో రష్యా ఉన్నాయి. కానీ ఏటా వెలువరించే కర్బన ఉద్గారాల్లో చైనా ఇప్పుడు అగ్రభాగాన ఉంది. తలసరి ఉద్గారాల్లో ఇప్పటికీ మనం ప్రపంచ సగటుకన్నా తక్కువగానే ఉన్నాం. పునరుత్పాదక ఇంధన రంగానికి మారడానికి అవసరమైన సాంకేతికతలనుపొందాలంటే భారీ మొత్తంలో నిధులు అవసరమవుతాయన్న అంచనా ఉంది.అయితే అభివృద్ధి చెందిన దేశాలు ఈ సాంకేతికతల్ని చవగ్గా అందిస్తే మనం మాత్రమే కాదు... చాలా దేశాలు వీటిని పొందగలుగుతాయి. నిరుడు బ్రెజిల్‌లోని బెలెమ్‌లో జరిగిన కాప్--30 సదస్సులో కొత్త సాంకేతికతల కోసం 2035 నాటికి 31,000 కోట్ల డాలర్లు అవసరమవుతాయని అంచనా వేశారు. భూగోళమే ప్రమాదంలో పడిందని సమితిసంస్థలు రెండూ చెబుతున్న నేపథ్యంలోనైనా సంపన్న దేశాలు లాభార్జన దృష్టి విడనాడాలి. లేకుంటే మూకుమ్మడిగా అందరం మునిగే ప్రమాదం ఉంటుందన్న స్పృహ తెచ్చుకోవాలి.

## సీఎం చంద్రబాబుకు రఘువీరారెడ్డి లేఖ

మొదటిపేజీ తరువాయి - కౌన్సెలింగ్‌లో 'ఆల్ ఆప్షన్స్' విధానాన్ని రద్దు చేస్తూ జారీ చేసిన ఈ జీవో వల్ల మెరిట్ విద్యార్థులకు, సామాజిక న్యాయానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆయన ఆరోపించారు.గతంలో హైకోర్టు ఆదేశాల మేరకు నిపుణుల కమిటీ సిఫార్సులతో జీవో నెం. 151ను జారీ చేశారని, దాని ప్రకారం 'ఆల్ ఆప్షన్స్' విధానం పారదర్శకంగా అమలయ్యేదని రఘువీరారెడ్డి తన లేఖలో గుర్తుచేశారు. అయితే, 2026 జులై 30న జారీ చేసిన జీవో 102తో ఆ విధానాన్ని నిలిపివేయడం అన్యాయమని పేర్కొన్నారు. దీని దుష్ప్రభావం 2026 అడ్మిషన్లలో స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు.ఈ ఏడాది అడ్మిషన్లలో ఏయూ రీజియన్‌లో 43 మంది, ఎస్వీయూ రీజియన్‌లో 27 మంది, మొత్తం 70 మంది రిజర్వ్ కేటగిరీ విద్యార్థులు ఓపెన్ కాంపిటీషన్ కటాఫ్ కంటే మెరుగైన ర్యాంకులు సాధించినప్పటికీ, వారికి రిజర్వేషన్ కోటాలోనే సీట్లు కేటాయించారని రఘువీరారెడ్డి తన లేఖలో గణాంకాలతో సహా వివరించారు. వాస్తవానికి వీరికి ఓపెన్ కాంపిటీషన్‌లో సీట్లు కేటాయించి ఉంటే, ఆ 70 రిజర్వ్ సీట్లు వారి కేటగిరీలోని ఇతర విద్యార్థులకు దక్కేవని, తద్వారా సామాజిక న్యాయం జరిగేదని అభిప్రాయపడ్డారు.అందువల్ల, ప్రభుత్వం తక్షణమే స్పందించి జీవో 102ను పునఃసమీక్షించాలని, 'ఆల్ ఆప్షన్స్' విధానాన్ని పునరుద్ధరించాలని, పాత జీవో 151ని యథాతథంగా కొనసాగించాలని రఘువీరా రెడ్డి డిమాండ్ చేశారు. 2026 అడ్మిషన్ల ప్రక్రియను సమీక్షించి, విద్యార్థులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని కోరారు. ఇది మెరిట్, పారదర్శకత, సామాజిక న్యాయానికి సంబంధించిన విషయమని, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

## గ్లోబల్ లీడర్లలో మోదీ అత్యంత స్ఫూర్తిదాయకం

మొదటిపేజీ తరువాయి - ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను బెల్జియం ఒక విశ్వసనీయ భాగస్వామిగా చూస్తోందని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య దౌత్య, ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇదే సమయంలో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలు, టారిఫ్‌లపై ఆయన పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఏ క్షణాన ఏ నిర్ణయం తీసుకుంటారో తెలియని అస్థిరత వల్ల ప్రపంచ వాణిజ్యమే ప్రమాదంలో పడుతుందని... స్వేచ్ఛా వాణిజ్యం, బలమైన ద్వైపాక్షిక భాగస్వామ్యాల ద్వారానే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

## ముదురుతున్న యుద్ధ మేఘాలు

మొదటిపేజీ తరువాయి - మిత్రదేశమైన సౌదీ అరేబియాకు 5 బిలియన్ డాలర్ల విలువైన అత్యాధునిక బాంబులు, గైడెన్స్ కిట్లు, రక్షణ పరికరాలను విక్రయించేందుకు అమెరికా విదేశాంగ శాఖ ఆమోదం తెలిపింది. పశ్చిమాసియా ప్రాంతంలో ఇరాన్ దళాలు, యెమెన్‌లోని హూతీ రెబెల్స్ నుంచి నిరంతరం ఎదురవుతున్న క్షిపణి, డ్రోన్ దాడులను తిప్పికొట్టేలా సౌదీ అరేబియా వైమానిక రక్షణ సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వాషింగ్టన్ ప్రకటించింది.అమెరికా భద్రతా ప్రయోజనాలకు అనుగుణంగా, నాటోయేతర కీలక భాగస్వామియైన సౌదీ రక్షణను బలోపేతం చేయడంలో భాగంగానే ఈ ఒప్పందం కుదిరినట్లు యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ వెల్లడించింది. ఈ ప్రతిపాదిత ఆయుధాల విక్రయంపై అగ్రరాజ్యం ఇప్పటికే తన కాంగ్రెస్‌కు అధికారిక సమాచారం అందించింది. పశ్చిమాసియాలో దాడులు తీవ్రరూపం దాల్చుతున్న సమయంలో అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం అంతర్జాతీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది.

## అది విద్యా వ్యవస్థా లేక కార్పొరేట్ దోపిడీ వ్యవస్థా?



మొదటిపేజీ తరువాయి - మూడు నెలలు గడుస్తున్నా ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల కట్టడికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూల్ ఫీ రెగ్యులేటరీ కమిషన్‌ను తీసుకొస్తామని గతంలో ఇచ్చిన హామీ ఏమైందని, దానికి సంబంధించిన డ్రాఫ్ట్ బిల్లు రెండేళ్లుగా కేబినెట్ దాటి బయటకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. స్వయంగా విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న సీఎం రేవంత్ రెడ్డి... పేద, మధ్యతరగతి తల్లిదండ్రుల జేబులు గుల్లవుతున్నా ఎందుకు మౌనం వహిస్తున్నారని నిలదీశారు.ప్రభుత్వ భూముల్లో నడిచే హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ సైతం ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచినా సర్కార్ మౌనంగా ఉండటం కార్పొరేట్ విద్యా వ్యాపారులకు బాసటగా నిలవడమేనని కవిత ఆరోపించారు. 1994 నాటి జీవో ప్రకారం వార్షిక ఫీజుల పెంపు 5 శాతానికి మించకూడదన్న స్పష్టమైన నిబంధన ఉన్నా దానిని పక్కనబెట్టి, విద్యా వ్యవస్థను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. రాబోయే శాసనసభ సమావేశాల్లోనే తక్షణమే పాఠశాల ఫీజుల నియంత్రణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని, లేనిపక్షంలో బాధితులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# ఉద్యోగులకు తీపి కబురు

మొదటిపేజీ తరువాయి -

ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని భేటీలో ఉద్యోగ సంఘాల నేతలకు సీఎం వివరించారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందన్న సీఎం గత రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించారు. ఆర్థికంగా అనేక సవాళు ఉన్న నేపథ్యంలో ఉద్యోగులు సంయమనం పాటించాలని చంద్రబాబు కోరారు. అయితే ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రిటైర్డ్ ఉద్యోగులకు లబ్ధి కలిగిందన్న ఉద్యోగ సంఘాల నేతలు సాధారణ ఉద్యోగులకు ఆశించిన స్థాయిలో ప్రయోజనాలు అందలేదని సీఎం దృష్టికి తీసుకెళ్లారు.డిమాండ్లు - సానుకూల స్పందన: దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించి 12వ పీసీఆర్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఛైర్మన్‌ను త్వరలో నియమిస్తామని తెలిపారు. 2024 జూలై 1, 2025 జనవరి 1 నుంచి పెండింగ్‌లో ఉన్న రెండు డీఏ లను అక్టోబర్ 1, 2026 నుంచి చెల్లించేందుకు అంగీకరించారు. 2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవ్ నగదును వచ్చే సంక్రాంతికి చెల్లించడంతోపాటు పోలీసు సిబ్బందికి అదనంగా మరో సరెండర్ లీవ్‌ను అక్టోబర్ నుంచి చెల్లించేందుకు ముఖ్యమంత్రి సరేనన్నారు.అయితే పీసీఆర్ ఏర్పాటు చేసేలోగా ఐఆర్ ఇవ్వాలని ఉద్యోగ సంఘాల నేతలు కోరగా కచ్చితంగా ఇస్తామని, అందుకు కొంత సమయం కావాలని చంద్రబాబు కోరారు. పెన్షనర్లకు అదనపు క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం అదనపు పెన్షన్ క్వాంటమ్‌ను 2027 జనవరి నుంచి అమలు చేస్తారు. ఆరోగ్య పథకంలో ఉద్యోగులు కోరిన మార్పును సీఎం అంగీకరించారు."సీఎం చంద్రబాబుతో ఉద్యోగ సంఘాల సమావేశం మంచి వాతావరణంలో జరిగింది. పీఆర్సీతో పాటు రెండు డీఏలు, ఒక సరెండర్ లీవ్ (పోలీసులకు అదనంగా మరొకటి), రిటైరైనవారికి అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ రీస్టోరేషన్, ఈహెచ్ఎస్ బకాయిలు ప్రతి నెలా ఒకటో తేదీన ట్రస్ట్‌కి చెల్లింపు తదితర సమస్యల పరిష్కారానికి సీఎం హామీ ఇచ్చారు. ఉద్యోగుల పట్ల సానుకూలంగా ఉండాలని మేం కోరాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఐఆర్ విషయంపై కొంత సమయం ఇవ్వాలని సీఎం చెప్పారు.ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని ఉద్యోగ సంఘాలు కోరాయి. ఈ అంశాన్ని కూడా త్వరలో పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు నేతలు తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలపైనా చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. సచివాలయ ఉద్యోగులకు ఇళ్ల స్థలాల అంశాన్ని త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పెండింగ్ బిల్లుల చెల్లింపుతో పాటు సీపీఎస్‌కు ఆమోదయోగ్యమైన శాశ్వత పరిష్కారం కల్పించాలని కోరారు.ప్రభుత్వ నిర్ణయాలపై ఆదివారం రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించి ఎలా ముందుకెళ్లాలనే అంశంపై చర్చిస్తామని బొప్పరాజు తెలిపారు.తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ ఉద్యోగులు, ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగుల బదిలీకి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని సమావేశంలో సీఎం చెప్పారని ఏపీటీఎఫ్ నేతలు తెలిపారు. ఇన్ సర్వీసు టీచర్లకు టెట్ విషయంలోనూ సానుకూల నిర్ణయం ఉంటుందని చెప్పారని వెల్లడించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచేందుకు ఉన్న వెసులుబాటుపై ఆలోచించాలని సీఎస్‌ను చంద్రబాబు ఆదేశించారని చెప్పారు. సీఎంతో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడే క్రమంలో ఉద్యోగ సంఘాల నేతల మధ్య పోటీ నెలకొనడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఒకరిపై ఒకరు నినాదాలు చేసుకోవడంతో పరిస్థితి పరస్పరం తోపులాట వరకు వెళ్లింది. పోలీసులు వెంటనే జోక్యం చేసుకున్నారు. ఉద్యోగ సంఘాల నేతలు కూడా సమన్వయం చేసుకుని వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు.

# 2029 నాటికి మరో మూడు డీఎస్సీలు

మొదటిపేజీ తరువాయి - ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. 2029లోగా మరో మూడు మెగా డీఎస్సీలు నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేస్తామని ఆయన కీలక ప్రకటన చేశారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో శనివారం జరిగిన ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మెగా డీఎస్సీ ఫైలుపైనే తొలి సంతకం చేశారని, ఇచ్చిన మాటకు కట్టుబడి 16,000 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టామని తెలిపారు."సీబీఎన్ అంటే డీఎస్సీ, డీఎస్సీ అంటే సీబీఎన్" అని అభివర్ణించిన లోకేశ్, చంద్రబాబు నాయకత్వంలో గతంలో 14 డీఎస్సీల ద్వారా సుమారు రెండు లక్షల మంది ఉపాధ్యాయులను నియమించిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. పని చేసేవాళ్లకే రాళ్ల దెబ్బలు తగులుతాయని, ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని వారు తనపై విమర్శలు చేస్తున్నా పట్టించుకోనని అన్నారు. "ఓటమిని అంగీకరించడం అనేది నా డిక్షనరీలో లేదు. చిన్న చిన్న స్పీడ్ బ్రేకర్లు వస్తుంటాయి. కానీ నా లక్ష్యం ఒక్కటే.. అంగన్‌వాడీ నుంచి పీజీ వరకు 'ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్'ను ప్రపంచంలోనే నెంబర్ వన్ చేయడం" అని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు.దశాబ్దాలుగా ఖాళీగా ఉన్న యూనివర్సిటీ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీపైనా మంత్రి కీలక ప్రకటన చేశారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పూర్తి చేసి, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు కొత్త జవసత్వాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.గత ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద జీవో 117 కారణంగా సుమారు 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను వీడి ప్రైవేటుకు వెళ్లారని లోకేశ్ ఆరోపించారు. తమ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ జీవోను రద్దు చేసిందని, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాప్రతినిధులతో చర్చించి 'మోడల్ ప్రైమరీ స్కూల్' వ్యవస్థను తీసుకొచ్చామని వివరించారు. దీని ఫలితంగా ఈ ఏడాది ఏకంగా 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడుల్లో చేరారని, ఈ ఘనత పూర్తిగా ఉపాధ్యాయులదేనని ప్రశంసించారు. ఉపాధ్యాయుల సర్వీస్ విషయాల్లో పారదర్శకత కోసం 'లీప్ యాప్'ను తీసుకొచ్చామని, బదిలీల ప్రక్రియను కూడా పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు.పిల్లల్లో ఏ చిన్న మార్పు కనిపించినా ఉపాధ్యాయులు గమనించాలి. వారిలో మానసిక స్థైర్యాన్ని, ఒత్తిడిని తట్టుకునే శక్తిని పెంచాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని పిలుపునిచ్చారు. ఇందుకోసం త్వరలోనే ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందిస్తామని తెలిపారు. ఫెయిల్ అంటే 'ఫస్ట్ అటెంప్ట్ ఇన్ లెర్నింగ్' అని పిల్లలకు నేర్పించాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యారంగంపై చూపిస్తున్న శ్రద్ధను వివరిస్తూ, మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా రుచి చూసి, నాణ్యత పెంచాలని ఆదేశించారని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తితోనే నాణ్యమైన బియ్యాన్ని అందిస్తున్నామన్నారు. ఏపీజే అబ్దుల్ కలాం, సావిత్రిబాయి పూలే వంటి మహనీయులను ఉదాహరణగా చూపుతూ, ఒక ఉపాధ్యాయుడు తలచుకుంటే అద్భుతాలు సృష్టించగలడని, విద్యార్థుల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దగలడని అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సింగపూర్, ఫిన్లాండ్ వంటి దేశాలకు విద్యా పర్యటనలకు పంపి, అక్కడి ఉత్తమ విధానాలను ఇక్కడ అమలు చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు.

## ఇక ప్రపంచ పటం మారనుందా?

మొదటిపేజీ తరువాయి - పరిస్థితి అలా కాదు. భూమి ఆకారాన్ని చదునైన పటంగా మార్చినప్పుడు ఏర్పడిన వక్రీకరణే దీనికి కారణం. ఇప్పుడు ఈ తేడాను సరిచేసేందుకు ఐక్యరాజ్యసమితి కీలక నిర్ణయం తీసుకుంది. ఆఫ్రికా అసలు పరిమాణానికి దగ్గరగా కనిపించే కొత్త పటానికి జనరల్ అసెంబ్లీ ఆమోదం తెలిపింది.టోగో నేతృత్వంలో వచ్చిన తీర్మానానికి 164 దేశాలు అనుకూలంగా ఓటేశాయి. ఒక్క అమెరికా మాత్రమే వ్యతిరేకించింది. మరో ఆరు దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. ఈ నిర్ణయాన్ని ఆఫ్రికన్ యూనియన్ స్వాగతించింది. ప్రపంచ భౌగోళిక చిత్రణ మరింత కచ్చితంగా, సమానంగా ఉండేందుకు ఇదొక చారిత్రక అడుగు అని పేర్కొంది.కొత్తగా ప్రోత్సహిస్తున్న పటాన్ని 'ఈక్వల్ ఎర్త్ ప్రొజెక్షన్' అంటారు. ఇది 2018లో రూపొందించారు. ఇందులో దేశాలు, ఖండాలు వాటి వాస్తవ భూవైశాల్యానికి అనుగుణంగా కనిపిస్తాయి. దీంతో ఆఫ్రికా పరిమాణం పెద్దగా కనిపిస్తుంది. యూరప్, ఉత్తర అమెరికా పరిమాణం మాత్రం మెర్కేటర్ పటంతో పోలిస్తే తగ్గుతుంది.ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా ఉపయోగిస్తున్న మెర్కేటర్ పటాన్ని 1569లో ఫ్లెమిష్ కార్టోగ్రాఫర్ గెరార్డస్ మెర్కేటర్ రూపొందించారు. సముద్ర ప్రయాణాల్లో దిశలు, కోణాలను కచ్చితంగా చూపించేందుకు ఇది ఉపయోగపడుతుంది. అయితే భూమి గుండ్రని ఆకారాన్ని చదునైన పటంగా మార్చడం వల్ల ధ్రువాలకు దగ్గరగా ఉన్న ప్రాంతాలు వాస్తవం కంటే పెద్దగా కనిపిస్తాయి. అందుకే గ్రీన్‌లాండ్ దాదాపు ఆఫ్రికా అంత పెద్దదిగా కనిపిస్తుంది. వాస్తవానికి ఆఫ్రికా గ్రీన్‌లాండ్ కంటే దాదాపు 14 రెట్లు పెద్దది.అయితే యూఎన్ఓ నిర్ణయం వల్ల మెర్కేటర్ పటం వెంటనే కనుమరుగుకాదు. ఈ తీర్మానం తప్పనిసరి కాదు. దేశాలు, పాఠశాలలు, ప్రచురణ సంస్థలు, టెక్ కంపెనీలు కొత్త పటాన్ని స్వచ్ఛందంగా స్వీకరించాల్సి ఉంటుంది. టోగో మాత్రం ఈ ఏడాది చివరికల్లా తమ పాఠశాలల భౌగోళిక పుస్తకాల్లో కొత్త పటాన్ని తీసుకురావాలని నిర్ణయించింది.

## ఢిల్లీని ముంచెత్తిన భారీ వర్షం



మొదటిపేజీ తరువాయి - చేసింది. వర్షాల వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు, విమాన సర్వీసులపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.భారీ వర్షాల నేపథ్యంలో ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి విమానయాన సంస్థలు ప్రయాణికులకు పలు సూచనలు జారీ చేశాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల విమాన సర్వీసులు ఆలస్యమయ్యే అవకాశం ఉందని, ప్రయాణికులు తమ విమాన ప్రయాణ స్థితిగతులను ముందుగానే తనిఖీ చేసుకోవాలని సూచించాయి.రోడ్లపై నీరు నిలిచిపోవడంతో విమానాశ్రయానికి చేరుకోవడానికి అదనపు సమయం పట్టవచ్చని హెచ్చరించాయి. అయితే, ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన రాకపోకలు ప్రస్తుతానికి సాధారణంగానే కొనసాగుతున్నాయని విమానాశ్రయ నిర్వహణ సంస్థ జీఎంఆర్ స్పష్టం చేసింది.నగర పరిధిలోని కన్నాట్ ప్లేస్ ఔటర్ సర్కిల్, గీతా కాలనీ, అక్బర్ రోడ్ వంటి ప్రధాన ప్రాంతాలు జలమయమయ్యాయి. కన్నాట్ ప్లేస్‌లో మోటార్ల సాయంతో నీటిని తోడివేస్తున్నప్పటికీ, కొన్ని దుకాణాల్లోకి వర్షపు నీరు చేరింది. గ్రేటర్ నోయిడా, నోయిడా ప్రాంతాల్లోనూ భారీ వర్షపాతం నమోదైంది.ఈ వర్షాల ప్రభావంతో ఢిల్లీ వాసులకు ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది. నగరంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 24.8 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. అయితే, ఆదివారం నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని, సెప్టెంబర్ 7 నుంచి కేవలం తేలికపాటి జల్లులు మాత్రమే కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.ఢిల్లీని ముంచెత్తిన భారీ వర్షం

# హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్

మొదటిపేజీ తరువాయి -

టెక్నాలజీ ఆఫీసర్ ఉదయ్ రుద్రరాజు సమావేశంలో పాల్గొన్నారు.హైదరాబాద్‌లో 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో 1 గిగావాట్ (1,000 మెగావాట్లు) సామర్థ్యంతో ఈ అత్యాధునిక ఏఐ డేటా సెంటర్ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. హైపర్ వాల్ట్‌తోపాటు భాగస్వామ్య సంస్థలు ఈ ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణకు దాదాపు రూ.70 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నారు. ఈ ప్రాజెక్టుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 7 వేల ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు, గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్‌కు అవసరమైన భారీ కంప్యూటింగ్ మౌలిక వసతులను ఈ క్యాంపస్ అందించనుంది. అధిక సామర్థ్యమున్న కంప్యూటింగ్ వ్యవస్థలు, లిక్విడ్ కూలింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దనున్నారు. దేశంలోని అత్యంత అధునాతన, అతిపెద్ద ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్యాంపస్‌లలో ఇది ఒకటిగా నిలవనుంది.తెలంగాణకే కాకుండా దేశానికి ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఏఐ విప్లవంలో హైదరాబాద్ ప్రపంచస్థాయిలో అగ్రగామిగా ఎదుగుతోందని అభిప్రాయపడ్డారు. ఏఐ మోడల్స్, కంప్యూటింగ్ సామర్థ్యం భవిష్యత్తులో కీలక ప్రజా మౌలిక వసతులుగా మారనున్న తరుణంలో ఆ సామర్థ్యం తెలంగాణలోనే అందుబాటులో ఉండటం రాష్ట్రానికి గొప్ప ప్రయోజనమని పేర్కొన్నారు. తెలంగాణలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన టీసీఎస్ ప్రతినిధులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ప్రభుత్వం తరపున తగిన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.టీసీఎస్ తీసుకున్న ఈ నిర్ణయంతో తన కల నెరవేరిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఆశించిన విధంగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి బలమైన పునాది పడిందన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్-2047 ప్రకారం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని సాధించే దిశగా ఈ ప్రాజెక్టు కీలక ముందడుగు అని అభివర్ణించారు."ఏఐ డేటా రంగంలో ఇది ఒక భారీ పెట్టుబడి. ఫ్యూచర్ సిటీలో ఏఐ డేటాసెంటర్ ఏర్పాటు చేయనున్నారు. ఈ ఏడాది జనవరిలో దావోస్‌లో టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్‌తో భేటీ అయినప్పుడు హైదరాబాద్‌లో పెట్టుబడుల అంశం ప్రస్తావించాను. ఆయన నా విజ్ఞప్తిని అంగీకరించారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన ప్రకటన ఉంటుందని తెలిపారు. ఇవాళ టాటా టీసీఎస్, హైపర్‌వాల్ట్ 70,000 కోట్లు పెట్టుబడి పెడుతున్నట్లు ప్రకటించారు. తద్వారా ఏడువేల మందికి ఉపాధి లభించనుంది.ఈ భారీ పెట్టుబడి ద్వారా ఏఐ, డేటా సెంటర్ల రంగంతోపాటు విద్యుత్, కూలింగ్, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో ఈ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలకు 2026 జనవరిలో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మధ్య జరిగిన సమావేశం నాంది పలికింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, టీసీఎస్ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి కొద్ది నెలల్లోనే ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకొచ్చాయి.దేశంలోని మరో ఐదు రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించింది. ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం మరింత చేరువైంది. ఈ కీలక సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి.అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ కె. శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## లక్కీ లాటరీ సీఎం రేవంత్‌ను కూల్చే రోజులు త్వరలోనే ఉన్నాయి

మొదటిపేజీ తరువాయి - విరుచుకుపడ్డారు. తెలంగాణ యువతకు స్కిల్ లేదనడానికి రేవంత్ రెడ్డికి ఏ అర్హత ఉందని, ఆయన స్వయంగా ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసిన మోసాలపై బీఆర్ఎస్ నిర్వహించిన 'యువభేరి' సభలో పాల్గొన్న కేటీఆర్, కేవలం లక్కీ లాటరీ తగలడం వల్లే రేవంత్ సీఎం అయ్యారని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీనే గడగడలాడించిన తెలంగాణ యువశక్తికి రేవంత్ రెడ్డి ఓ లెక్కే కాదన్నారు. ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ పేరిట పెద్ద పెద్ద మాటలు చెప్పిన కాంగ్రెస్ నేతలు, అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు ఇవ్వడం మానేసి లూటీఫికేషన్‌లు నడుపుతున్నారని మండిపడ్డారు.ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలంటున్న కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాలా, లేక ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను వంచించిన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. ప్రజలకు చేసిన 420 రకాల మోసాలకు గానూ రేవంత్ రెడ్డి 420 సార్లు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేవలం ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు రాబోతున్నాయని హెచ్చరించారు. మంత్రులు కమీషన్ల కోసం కొట్టుకుంటున్నారని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తమ ప్రభుత్వం 2.32 లక్షల ఉద్యోగాలు ఇస్తే, ఈ వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ ఇచ్చినవి కేవలం 16 వేల ఉద్యోగాలేనని చెప్పారు. ఉద్యోగాల కల్పనపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

## సింధు నదిపై భారత్ కొత్త ప్లాన్!

మొదటిపేజీ తరువాయి -

లడఖ్‌లో నీటి కొరతతో ఇబ్బంది పడుతున్న రైతులకు భారత్ ఊరటనిచ్చింది. సింధు నదిపై దేశంలోనే తొలి రాక్ చెక్ డ్యామ్‌ను నిర్మించింది. లేహ్‌లోని ఉప్షి వద్ద నిర్మించిన ఈ డ్యామ్ వల్ల నదిలో నీటి మట్టం దాదాపు 10 అడుగులు పెరిగింది. దీంతో వసంతకాలంలో సాగుకు నీరు అందక ఇబ్బంది పడుతున్న గ్రామాల పొలాలకు నీటిని మళ్లించే అవకాశం ఏర్పడింది.ఈ డ్యామ్‌ను సిమెంట్ ఉపయోగించకుండా పూర్తిగా సహజమైన పెద్ద రాళ్లతో నిర్మించారు. ఇందులో దాదాపు 4 కోట్ల లీటర్ల నీటిని నిల్వ చేయవచ్చు. ఈ నీటిని ఇగూ ఫే సాగునీటి కాలువ ద్వారా పొలాలకు అందిస్తున్నారు.ఇప్పటివరకు లడఖ్‌లోని పలు ప్రాంతాల్లో సింధు నది లోతైన లోయల మధ్య తక్కువ స్థాయిలో ప్రవహించేది. దీంతో వసంతకాలంలో పంపుల ద్వారా నీటిని తీసుకోవడం రైతులకు సాధ్యమయ్యేది కాదు. ఫలితంగా సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ నేపథ్యంలో ఉప్షి వద్ద నిర్మించిన చెక్ డ్యామ్ స్థానిక వ్యవసాయానికి ఉపయోగపడటంతో పాటు వ్యూహాత్మకంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది. సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన పరిస్థితుల్లో సరిహద్దు ప్రాంతాల్లో నదీ జలాలను వినియోగించుకునేందుకు మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామనే సంకేతాన్ని ఈ ప్రాజెక్టు ఇస్తోంది.లడఖ్ పాలన యంత్రాంగం ఇలాంటి మరిన్ని చెక్ డ్యామ్‌ల నిర్మాణంపై దృష్టి పెట్టింది. ఇందుకోసం కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖకు 36 ప్రాజెక్టులతో ప్రతిపాదన పంపింది. ఇందులో లేహ్ ప్రాంతంలో 7 హిమాలయన్ రాక్ చెక్ డ్యామ్‌లు, కార్గిల్‌లో 29 చెక్ డ్యామ్‌లు ఉన్నాయి. వీటి అంచనా వ్యయం రూ.56 కోట్లకు పైగానే ఉంది.

# సైబరాబాద్‌లో మహిళల భద్రతపై పోలీసుల ప్రత్యేక చర్యలు

**- సైబరాబాద్ షీ టీమ్స్ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు**

**- వారంలో 97 డెకాయ్ ఆపరేషన్లు.. 19 మందిపై పెట్టీ కేసులు**






**సూర్య ఉదయం ప్రతినిధి, సైబరాబాద్:** ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 4 వరకు సైబరాబాద్ షీ టీమ్స్ 97 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించి, బహిరంగ ప్రదేశాల్లో అసభ్యకరంగా ప్రవర్తించిన 19 మందిని పట్టుకుని కేసులు నమోదు చేశాయని విమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్, సైబరాబాద్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె. సృజన తెలిపారు. నివారణ, అవగాహన చర్యల్లో భాగంగా-ూనిఖ, షీ టీమ్స్ సైబరాబాద్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. ఈ కార్యక్రమాల్లో సుమారు 3,235 మంది పాల్గొన్నారు. మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ రవాణా, ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, బాల్య వివాహాలు, బాలల హక్కులు, బాల కార్మిక వ్యవస్థ, స్టాకింగ్, యాచకత్వం, సైబర్ బుల్లీయింగ్, సైబర్ మోసాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళల హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, డయల్ 100/112, సైబర్ నేరాల కోసం 1930ను సంప్రదించే విధానంపై కూడా ప్రజలకు వివరించారు. సెప్టెంబర్ 1న సైబరాబాద్ షీ టీమ్స్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (రాజూజ), సైబాజ్ డేటా సంస్థల సహకారంతో మహిళా ఉద్యోగుల కోసం విమెన్స్ అవేర్నెస్ అండ్ సెల్ఫ్ - డిఫెన్స్ బూట్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళల భద్రత, చట్టపరమైన అవగాహన, డిజిటల్ భద్రత, ఫిర్యాదుల నమోదు విధానం, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానాలపై అవగాహన కల్పించారు. రాజూజ డైరెక్టర్ రష్మి డిజిటల్ భద్రత, పోలీసు-- సమాజ భాగస్వామ్య ప్రాధాన్యతపై మాట్లాడారు. షీ టీమ్స్ ఇన్‌స్పెక్టర్ వై. హనుమాన్ గౌడ్, ఎస్ఐ అంబిక మహిళలకు చట్టపరమైన హక్కులు, ఫిర్యాదు విధానం, అత్యవసర సహాయంపై అవగాహన కల్పించారు. అనంతరం డా. రవి మాస్టర్ మరియు ఆయన బృందం ఆధ్వర్యంలో మహిళలకు ఆచరణాత్మక స్వీయ రక్షణ పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. మహిళల భద్రత, సాధికారత, అవగాహన కోసం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సైబరాబాద్ షీ టీమ్స్ అభినందించింది. మహిళల భద్రతకు తమ చర్యలు నిరంతరం కొనసాగుతాయని డిప్యూటీ కమిషనర్ తెలిపారు..

# "గురుదక్షిణ" గొప్ప ఆలోచన రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు

**సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలో భిన్నంగా గురుపూజోత్సవం.**

**అంజిబాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురుదక్షిణ పేరుతో పుస్తక ఆవిష్కరణ.**







**సూర్య ఉదయం ప్రతినిధి హైదరాబాద్ :** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలో గురుపూజోత్సవ వేడుకలు భిన్నంగా జరిగాయి. గురుదక్షిణ కవితా సంకలనం పేరుతో పుస్తకాన్ని ముద్రించి యూనివర్సిటీకి చెందిన జర్నలిజం విద్యార్థులు గురువులకు అంకితం చేశారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం రిజిస్ట్రార్ హనుమంతరావు మాట్లాడుతూ కేవలం వారం రోజుల్లోనే.. చక్కటి కవితలతో అందమైన డిజైన్ తో అంత మంచి పుస్తకం తీసుకొచ్చారంటే.. వీరు భవిష్యత్తులో మరిన్ని మంచి పుస్తకాలు తీసుకొస్తారని, తీసుకురావాలని ఆకాంక్షిస్తూ సంపాదకులు కొండూరి కోటి బాబు, ఎస్. కళ్యాణ్ దాస్, నాగుల అంజిబాబులను అభినందించారు. ఈ పుస్తకానికి ఆర్థిక సహకారం అందించేందుకు అంజిబాబు ఫౌండేషన్ ముందుకు రావడం సంతోషదగ్గ విషయమన్నారు. గురువుల గొప్పదనాన్ని చాటేలా పుస్తకం ఉందని, తమ యూనివర్సిటీ విద్యార్థులు మంచి ప్రయత్నం చేశారని అభినందించారు. గురుపూజోత్సవం సందర్భంగా తనని ఇంతటి వారిని చేసిన తన గురువులను గుర్తు చేసుకుంటూ, తన అనుభవాలను వివరించారు. ఒక్కో టీచర్ లో, ఒక్కో డిఫరెంట్ టాలెంట్ ఉంటుందని తెలిపారు. నేటి కాలంలో కూడా గురువుల ప్రాముఖ్యతను గుర్తిస్తూ గౌరవించుకోవడం మంచి సంప్రదాయమని అన్నారు. జీవితంలో ప్రతి ఒక్కరి నుంచి మనం ఏదో ఒకటి నేర్చుకుంటూనే ఉంటామని, మనిషి జీవితంలో ఎందరో గురువులు ఉంటారని పేర్కొన్నారు. విద్యార్థుల అభిప్రాయాల్ని, వాళ్లకు తెలిసిన విషయాల్ని చెప్పే అవకాశం ఇస్తూ, టీచర్ కూడా విద్యార్థుల నుంచి నేర్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. తెలుగు యూనివర్సిటీ విద్యార్థులతో పాటు, తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు 60 మంది కవులు గురువుల గొప్పదనం చాటుతూ చక్కటి కవితలను ఈ పుస్తకంలో అక్షరీకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ అధ్యాపకులను సత్కరించారు.

**అంజిబాబు ఫౌండేషన్ కు అభినందనలు**

విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన గురుదక్షిణ కవితా సంకలనానికి ఆర్థిక సహకారం అందించేందుకు ముందుకు వచ్చిన అంజిబాబు ఫౌండేషన్ ను రిజిస్ట్రార్ హనుమంతరావు అభినందించారు. ముమ్ముందు ఇలాంటి మంచి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని సీఈవో ఫౌండర్ అంజిబాబుకు సూచించారు.

**త్రిమూర్తుల గురుదక్షిణ అభినందనీయం**

జర్నలిజం విభాగం తరపున సీనియర్ అధ్యాపకురాలు షేక్ హసీనా మాట్లాడుతూ.. గురుదక్షిణ కవితా సంకలనానికి సంపాదకులుగా వ్యవహరించిన త్రిమూర్తులు కోటి బాబు, అంజిబాబు కళ్యాణ్ ల కృషి అభినందనీయం అన్నారు. త్రిమూర్తులుగా అభివర్ణించారు. మంచి కార్యక్రమానికి అధ్యాపకుల సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. ప్రధాన సంపాదకులు కోటి బాబు మాట్లాడుతూ గురుదక్షిణ పుస్తకం తీసుకువచ్చేందుకు మమ్మల్ని ప్రోత్సహించిన వీసీ, రిజిస్ట్రార్, జర్నలిజం విభాగం శాఖాధిపతి, అధ్యాపకులకు, గురువుల గొప్పతనాన్ని చాటుతూ కవితలను రాసిన కవులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అంజిబాబు ఫౌండేషన్ సీఈఓ నాగుల అంజిబాబు మాట్లాడుతూ అంజిబాబు ఫౌండేషన్ ద్వారా చేస్తున్న మొదటి కార్యక్రమం గురుపూజోత్సవం రోజు జరగటం ఆనందదాయకమని, తన విద్యావంతుడు కావటానికి సహకరించిన గురువులందరికి తాను సమర్పించే గురుదక్షిణగా, ఈ గురుదక్షిణ పుస్తకానికి అంజిబాబు ఫౌండేషన్ సహకరించటం తను తన గురువులకు సమర్పించే గురుదక్షిణ అని తెలియజేశారు. సంపాదకుడు కళ్యాణ్ దాస్ మాట్లాడుతూ ఈ గురుదక్షిణ కవితా సంకలనానికి సంపాదకుడుగా ఉండటం గర్వకారణమని, గురుదక్షిణకు స్వల్ప కాలంలోనే విశేష స్పందనతో కవులు స్పందించి కవితలు రాసి పంపటం, గురుదక్షిణ రోజే, పుస్తకాన్ని ఆవిష్కరించాలని లక్ష్యంతో శ్రమించామని, కవితలు రాసిన కవులందరికి ధన్యవాదాలు తెలియజేస్తూ వందన సమర్పణతో ముగించారు. ఈ కార్యక్రమంలో సంగీత విభాగం ఆచార్యులు బి. రాధ, ఓ. విజయ్, జర్నలిజం, తెలుగు ఇతర విభాగాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయం

**- గచ్చిబౌలి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను సత్కరించిన సైబరాబాద్ సీపీ**






**సూర్య ఉదయం ప్రతినిధి, సైబరాబాద్:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్, గచ్చిబౌలిలోని జెడ్‌పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించి వారి సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా సీపీ రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో తల్లే తొలి గురువు అని అన్నారు. తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో మెరుగైన మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు ఉన్నతమైన, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడమే ఉపాధ్యాయులకు అందించే గొప్ప బహుమతి అని సీపీ అన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, మహిళల భద్రత, డ్రగ్స్ నివారణ, సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించడంలో పోలీసులు, ఉపాధ్యాయులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.

**విద్యార్థులతో సీపీ ముఖాముఖి**

అనంతరం సీపీ విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. సమాజంలో ఎదురవుతున్న వివిధ సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థి జూడ్ సీపీని కోరాడు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధించాలని, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించేలా అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశాడు. దీనిపై సీపీ స్పందిస్తూ.. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని, ప్రతి వాహనదారుడు హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు.

**మహిళల భద్రతపై విద్యార్థిని స్నేహిత ప్రశ్న**

మహిళలు, బాలికల భద్రత కోసం పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని విద్యార్థిని స్నేహిత ప్రశ్నించింది. దీనికి సీపీ సమాధానమిస్తూ.. మహిళలు, బాలికల రక్షణ కోసం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో షీ టీమ్స్ నిరంతరం పనిచేస్తున్నాయని తెలిపారు. మహిళలు లేదా బాలికలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా వెంటనే డయల్ 100 లేదా 112కు ఫోన్ చేసి పోలీసులను సంప్రదించాలని సూచించారు.

**డ్రగ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి**

పాఠశాలకు వచ్చే మార్గంలో కొందరు వ్యక్తులు డ్రగ్స్ సేవిస్తున్నట్లు కనిపిస్తున్నారని కొంతమంది విద్యార్థులు సీపీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన సీపీ.. డ్రగ్స్ వినియోగం, విక్రయాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. విద్యార్థులు ఇలాంటి కార్యకలాపాలను గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. తాము డ్రగ్స్‌కు దూరంగా ఉండటంతో పాటు తమ స్నేహితులను కూడా వాటికి దూరంగా ఉండేలా ప్రోత్సహించాలని కోరారు. రోడ్డు దాటే సమయంలో ఇబ్బంది ఎదురైతే సమీపంలోని ట్రాఫిక్ పోలీసుల సహాయం తీసుకోవాలని విద్యార్థినులకు సూచించారు.

**సైబర్ మోసాలపై విద్యార్థి నిఖిల్ ఆందోళన**

గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి ఓటీపీ చెప్పాలని కోరగా, ఓటీపీ చెప్పిన వెంటనే తన ఖాతా నుంచి రూ.4,000 డెబిట్ అయ్యాయని విద్యార్థి నిఖిల్ సీపీ దృష్టికి తీసుకువచ్చాడు. ఇలాంటి సైబర్ మోసాల నుంచి ఎలా రక్షించుకోవాలని ప్రశ్నించాడు. దీనిపై సీపీ మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ, బ్యాంక్ వివరాలు, పిన్ లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించకూడదని స్పష్టం చేశారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న హెచ్ఎం రెహానా బేగం, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు మునీర్ అహ్మద్ లను సీపీ డా. ఎం. రమేష్ ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, మాదాపూర్ ఏసీపీ శ్రీధర్, రాయదుర్గం ఎస్‌హెచ్ఓ భూపతి, పోలీసు అధికారులు, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 'నైరా' కలెక్షన్ విడుదల

**- శ్రీనిధి శెట్టి ప్రచార చిత్రం ఆవిష్కరణ!**






**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్ పల్లి:** సహజ రత్నాల ఆభరణాల తయారీలో సరికొత్త శైలిని పరిచయం చేస్తూ 'నైరా' (ఝఱఅఞ్ఞ) కలెక్షన్‌ను మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆవిష్కరించింది. ప్రముఖ నటి శ్రీనిధి శెట్టి ఈ సరికొత్త ప్రచార చిత్రంలో ముఖచిత్రంగా వ్యవహరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు మరియు కర్ణాటక రాష్ట్రాల్లో 'జెమ్ స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్'ను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఉత్సవంలో భాగంగా రత్నాలు మరియు అన్‌కట్ ఆభరణాల తరుగు ఛార్జీలపై 25% వరకు తగ్గింపు లభిస్తుంది. ఈ ప్రత్యేక ఆఫర్ 14 సెప్టెంబర్ 2026 వరకు అందుబాటులో ఉంటుంది. ఈ సందర్భంగా శ్రేయోభిలాషులు, స్టోర్ హెడ్ ఇర్ఫాన్ మాట్లాడుతూ ప్రకృతి ప్రసాదించిన అరుదైన సంపదల శాశ్వత సౌందర్యం నుంచి స్ఫూర్తి పొందిన 'నైరా', సాంప్రదాయ ఆభరణాల తయారీ కళను ఆధునిక రూపంలో ఆవిష్కరిస్తోంది. బంగారంలో అద్భుతంగా రూపొందించి, విలువైన సహజ రత్నాలతో పొదిగిన ఈ కలెక్షన్ శిల్ప రూపాలను, క్లిష్టమైన డిజైన్లను ఒకచోట చేర్చుతోంది. కొత్త తర వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా అద్భుతమైన పనితనంతో ఈ ఆభరణాలను తీర్చిదిద్దారు. "రత్నాల ఆభరణాలు ప్రకృతి సౌందర్యాన్ని, హస్తకళా నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తాయి. 'నైరా' ద్వారా సహజ రత్నాలను అత్యున్నత పనితనంతో ఆవిష్కరించాలనుకున్నాం. బాధ్యతాయుతమైన ఆభరణాల వ్యాపారిగా నాణ్యత, పారదర్శకత, నమ్మకమైన కొనుగోలు ప్రమాణాలను అందించడంపైనే మా దృష్టి ఉందన్నారు. 1993లో స్థాపించబడిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్.. మలబార్ గ్రూప్ యొక్క ఫ్లాగ్‌షిప్ కంపెనీ. 9.41 బిలియన్ డాలర్ల వార్షిక టర్నోవర్‌తో ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద ఆభరణాల రిటైలర్‌గా గుర్తింపు పొందింది. ప్రస్తుతం 14 దేశాలలో 450కి పైగా షోరూమ్‌ల నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. భారత్, మధ్యప్రాచ్యం, అమెరికా, ఖఖ వంటి దేశాలలో విస్తరించి ఉన్న ఈ సంస్థలో 30,000 మందికి పైగా నిపుణులు సేవలు అందిస్తున్నారు అని అన్నారు.

# సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలు చిరస్మరణీయం

**- భారత్‌నగర్‌లో జయంతి వేడుకల్లో పాల్గొన్న బండి రమేష్**





**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి:** భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని భారత్‌నగర్‌లోని ప్రభుత్వ పబ్లిక్ స్కూల్‌లో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి బండి రమేష్ పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. విద్యారంగ అభివృద్ధికి, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్రను గుర్తించడంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ అందించిన సేవలను ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, సమాజ అభివృద్ధికి నాణ్యమైన విద్య ఎంతో అవసరమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సేవలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, తూము వేణు, ఏఎంసీ చైర్మన్ పుష్పారెడ్డి, టెంపుల్ చైర్మన్ మూర్తి, వెంకటేష్ యాదవ్, బాలరాజు, క్రాంతి, రమణ, సంతోష్ తదితరులతో పాటు ఉపాధ్యాయులు రత్నారావు, లక్ష్మీ, రాజారావు మరియు పలువురు పాల్గొన్నారు.

# భూ భారతి పేరుతో భూముల హక్కులను హరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం-బీజేపీ





**సూర్య ఉదయం ప్రతినిధి హైదరాబాద్...:** ఇందిరాపార్క్: భూ భారతి పేరుతో పేదలు, మధ్యతరగతి ప్రజలు, రైతులకు చెందిన భూములను సెక్షన్ 22ఎ పరిధిలో చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన 'ఛలో ఇందిరాపార్క్--మహా దీక్ష' కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కాంచి మహేందర్ పాల్గొన్నారు. ప్రజల భూముల హక్కులను పరిరక్షించడంతో పాటు రైతులు, సామాన్య ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు బీజేపీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఆయన ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు సంబంధించిన భూములపై హక్కులను కాపాడేందుకు బీజేపీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని కాంచి మహేందర్ పేర్కొన్నారు. పేదలు, రైతులు, మధ్యతరగతి కుటుంబాల భూ హక్కులకు భంగం కలగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. "ప్రజల భూముల హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ పోరాటం నిరంతరం కొనసాగుతుంది" అని ఆయన స్పష్టం చేశారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం దక్కడం అదృష్టం

**- గడ్డమీది బాలరాజు**




**సూర్య ఉదయం ప్రతినిధి, మేడ్చల్ జిల్లా:** జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా జగద్గిరిగుట్ట లోని సంస్కృతి పాఠశాల ప్రధానోపా ధ్యాయులు గడ్డమీది బాలరాజు అందుకున్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాల యంలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కా రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాల్ అహ్మద్, జిల్లా విద్యాశాఖ అధికారిని రేణుకల చేతుల మీదుగా ఈ అవార్డును తీసుకున్నారు. ఈ సందర్భంగా గడ్డమీది బాలరాజు మాట్లాడుతూ తనకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం దక్కడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. సామాన్య ప్రజానీకం అధికంగా నివసించే ప్రాంతంలో ఓ ప్రైవేటు పాఠశాల అతి తక్కువ ఫీజులతో నెలకొల్పి విద్యను అందించడం సంతోషంగా ఉందన్నారు. ప్రయివేట్ విద్య అందని ద్రాక్ష అనుకుంటున్న ఈ రోజుల్లో తాను నెలకొల్పిన పాఠశాలలో బడుగు, బలహీన ప్రజల స్థోమతకు తగిన విధంగా ఫీజులు ఉంటాయాన్నారు. విద్యా సంస్థలతోనే కాకుండా తాను చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం దక్కిందని హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను చేరువ చేసేందుకు పాటుపడుతానని స్పష్టం చేశారు. తనకు జిల్లా పురస్కారం దక్కడానికి చొరవ చూపిన జిల్లా ట్రస్మా, కుత్బుల్లాపూర్ ట్రపసా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## బాలానగర్ పోలీసులా ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ లో గురువులకు సన్మానం, విద్యార్థులకు అవగాహన



**సూర్య ఉదయం ప్రతినిధి కూకట్ పల్లి :** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం బాలానగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (గ్రూూ) లో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేశ్ ఆదేశాల మేరకు బాలానగర్ లా అండ్ ఆర్డర్ సీఐ జి. ప్రశాంత్, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ పాఠశాలను సందర్శించి, ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా సీఐ జి. ప్రశాంత్ మాట్లాడుతూ--- "విద్యార్థులకు కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా, వారిలో క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందిస్తూ సమాజ నిర్మాణానికి పునాదులు వేస్తున్న ఉపాధ్యాయుల సేవలు అమూల్యమైనవి. 'ఒక సదుపాధ్యాయుడు వందలాది మంది భవిష్యత్తును తీర్చిదిద్దగలడు' అన్న సూక్తిని నిజం చేస్తూ, రేపటి పౌరులను తీర్చిదిద్దుతున్న గురువులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు.సన్మాన కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన ముఖాముఖిలో ఇరువురు సీఐలు విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ ధరించడం, మైనర్ డ్రైవింగ్ చేయకపోవడం, రోడ్డు భద్రతా నియమాలు పాటించడంపై మార్గదర్శనం చేశారు.ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచితులతో ఓటీపీలు (ూూ), బ్యాంకు వివరాలు పంచుకోవద్దని హెచ్చరించారు. మాదకద్రవ్యాల నివారణ, అవగాహనలో భాగంగా డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, అత్యవసర సమయాల్లో భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని లేదా '100 / 1930' సాయం తీసుకోవాలని సూచించారు.విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు అధికారులు ఆసక్తికరంగా సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్వేతా, పాఠశాల ప్రధానోపాధ్యాయిని (హెచ్ఎం) అరుణ జ్యోతి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## గురువుల బోధనలు విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకం

**- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**






**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి:** గురుపూజోత్సవం సందర్భంగా కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం టీచర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులను సన్మానించారు. మోలుగు ఆనందరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రోత్సాహక బహుమతులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత విద్యార్థుల జీవితాల్లో గురువులదే కీలక పాత్ర అని అన్నారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ఉపాధ్యాయుల బోధనలు, సూచనలు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. గురువులు చూపిన బాటలో పయనిస్తూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకుంటే తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు కూడా ఎంతో సంతోషిస్తారని ఎమ్మెల్యే అన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబోధన చేస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని కొనియాడారు. తాను కూడా ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం చేసి ఎమ్మెల్యేగా ఎదిగానని మాధవరం కృష్ణారావు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. విద్యార్థులు తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులను గౌరవిస్తూ కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాయులందరికీ ఎమ్మెల్యే టీచర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రంగారావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.౦

## గూడూరు శాఖ గ్రంథాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి కార్యక్రమం



**సూర్య ఉదయం ప్రతినిధి (సెప్టెంబర్ 05) :** కర్నూలు జిల్లా గూడూరు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి కవిత బాయి ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత బాయి మాట్లాడుతూ 1962 నుండి 1967 వరకు భారతదేశానికి రెండవ రాష్ట్రపతిగా పనిచేసిన మహోన్నత భారతీయ రాజకీయవేత్త, తత్వవేత్త, రాజనీతిజ్ఞుడు సర్వేపల్లి రాధాకృష్ణ అన్నారు. 1952 వ సంవత్సరం నుండి 1962 వరకు భారతదేశానికి మొదటి ఉపరాష్ట్రపతిగా పనిచేశారని, రాధాకృష్ణన్ తులనాత్మక మతం, తత్వశాస్త్రం యొక్క 20వ శతాబ్దపు అత్యంత ప్రభావవంతమైన, విశిష్టమైన పండితులలో ఒకరిగా పరిగణించబడ్డాడని గ్రంథాలయ అధికారిణి కవిత బాయి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మరియు గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

## సన్నిధి ఆర్కిటెక్స్ కార్యాలయం ప్రారంభించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు




**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి, వివేకానంద నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సన్నిధి ఆర్కిటెక్స్ కార్యాలయం శనివారం ఘనంగా ప్రారంభమైంది. సంస్థ నిర్వాహకులు సన్నిధి శ్రీహరి, సన్నిధి కిరీటి ఆహ్వానం మేరకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న రాజేశ్వరరావు సన్నిధి శ్రీహరికి శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ దినదినాభివృద్ధి చెంది ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సన్నిధి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులను ఆప్యాయంగా పలకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి, వ్యాపార రంగాల్లో రాణించాలని సూచించారు. తమతో పాటు మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి బీజేపీ సీనియర్ నాయకులు అల్లూరి సీతారామరాజు, దానబోయిన నర్సింగ్ రావు, సన్నిధి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

## 22-ఏ నిషేధిత భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

**- ఇంద్రాపార్క్‌లో బీజేపీ మహా దీక్షకు కూకట్‌పల్లి నుంచి భారీగా తరలివెళ్లిన నాయకులు, కార్యకర్తలు**





**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి:** 22-ఏ నిషేధిత భూముల జాబితా నుంచి రైతులు, సామాన్యుల భూములను తొలగించి వారికి న్యాయం చేయాలని, భూ భారతి పోర్టల్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీజేపీ ఆధ్వర్యంలో ఇంద్రాపార్క్ వద్ద మహా దీక్ష నిర్వహించారు. ఈ మహా దీక్షకు కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో వందలాది మంది నాయకులు, కార్యకర్తలు బైక్‌లు, కార్లతో భారీ ర్యాలీగా తరలివెళ్లి దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ 22-ఏ నిషేధిత భూముల జాబితాలో రైతులు, సామాన్యుల భూములు ఉండటంతో వారు సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సొంత భూములపై హక్కులు ఉన్నప్పటికీ వాటిని విక్రయించుకోలేక, రిజిస్ట్రేషన్ చేసుకోలేక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల భూములను 22-ఏ జాబితా నుంచి తొలగించి వారికి సంపూర్ణ న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా భూ భారతి పోర్టల్‌లో నెలకొన్న సాంకేతిక, పరిపాలనా సమస్యలను వెంటనే పరిష్కరించి, రైతులకు భూ సంబంధిత సేవలను సులభంగా అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతులను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పకుండా వారి సమస్యలకు పారదర్శకంగా పరిష్కారం చూపాలని కోరారు.అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ రైతులు, సామాన్యుల భూముల విషయంలో ఎలాంటి అన్యాయం జరిగినా బీజేపీ చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. రైతుల పక్షాన పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. 22-ఏ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళా నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**- ప్రజలను వంచించిన కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ పోరాటం ఉధృతం చేస్తాం: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**





**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థ పాలన సాగిస్తోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మూసాపేట్ డివిజన్‌లో శనివారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇందిరాగాంధీ విగ్రహం నుంచి జనతానగర్‌లోని చిత్తారమ్మ గుడి వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్ కుమార్ హాజరై నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మోసపూరిత ఆరు గ్యారెంటీలను నమ్మి ప్రజలు ఓట్లు వేస్తే, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ ప్రజలను పూర్తిగా వంచించిందని విమర్శించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయలేకపోయిందని ఆరోపించారు. మహాలక్ష్మి, రైతు భరోసా, చేయూత వంటి పథకాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని ఆయన విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన పలు సంక్షేమ పథకాలను కూడా ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసి ప్రజలపై అదనపు భారం మోపుతోందని ఆరోపించారు.అలాగే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఎమ్మెల్యే ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అసమర్థ పాలన కారణంగా నివాస గృహాలను సైతం 22-ూ నిషేధిత జాబితాలో చేర్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మాధవరం కృష్ణారావు దుయ్యబట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో నియోజకవర్గ



సమన్వయకర్త సతీష్ అరోరా, డివిజన్ మాజీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, మాజీ ప్రధాన కార్యదర్శి తిరుపతి, పార్టీ ముఖ్య నాయకులు, మహిళలు, యువకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ దినోత్సవం సమాజ వికాసానికి పునాది- వైస్ ప్రిన్సిపాల్ సుబాన్ బాషా

**సూర్య ఉదయం ప్రతినిధి (సెప్టెంబర్ 05)తుగ్గలి:-** గురువుల త్యాగాలు, సేవలు సమాజ వికాసానికి మూలస్తంభాలని, వారి మార్గదర్శకత్వంలోనే విద్యార్థులు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడతారని ఏ.పి.టి.డబ్ల్యూ.ఆర్.ఎస్ బాలుర పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సుబాన్ బాషా పేర్కొన్నారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని గురుకుల బాలుర పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు అత్యంత అంగరంగ వైభవంగా, ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. పాఠశాల యాజమాన్యం మరియు విద్యార్థుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా ముందుగా భారత మాజీ రాష్ట్రపతి, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ధూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ సుబాన్ బాషా మాట్లాడుతూ... అజ్ఞానమనే అంధకారాన్ని తొలగించి జ్ఞానమనే



వెలుగులను నింపే గురువుల స్థానం సమాజంలో అత్యున్నతమైనదని అన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, నైతిక విలువలు అలవర్చుకుని, నిరంతరం శ్రమించి ఉన్నత శిఖరాలను అధిరోహించడమే ఉపాధ్యాయులకు ఇచ్చే నిజమైన గురుదక్షిణ అని పిలుపునిచ్చారు.అనంతరం విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి, పాదాభివందనం చేసి తమ భక్తిశ్రద్ధలను, అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, ఉపాధ్యాయుల గొప్పతనాన్ని కొనియాడుతూ చేసిన ప్రసంగాలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయులు జనార్ధన్, గిరి,వెంకటేష్, శ్రీకృష్ణ, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఉపాధ్యాయులు సుధాకర్, ఏ.ఎన్.ఎం మంజుల, జూనియర్ అసిస్టెంట్ కృష్ణ, ఇతర సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వేడుకల ముగింపులో విద్యార్థులకు తీపి పదార్థాలు పంపిణీ చేశారు.

## ఎమ్మిగనూరులో జోరుగా అభివృద్ధి పనులు: రూ. 10 లక్షల నిధులతో సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే బి.వి. భూమిపూజ!



**ఎమ్మిగనూరు, సెప్టెంబరు 05 (సూర్య ఉదయం ప్రతినిధి):** ఎమ్మిగనూరు పట్టణాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథంలో నిలపడమే లక్ష్యంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయనాగేశ్వర్ రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. శనివారం పట్టణంలోని పలు కాలనీలలో విస్తృతంగా పర్యటించిన ఆయన, ప్రారంభోత్సవాలు మరియు వివిధ నిర్మాణ పనులకు భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు.పట్టణంలోని 8వ వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే బి.వి., ఎంబీ చర్చి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ నగర్, బాబు జగ్జీవన్ రామ్ కాలనీ మరియు ఎరుకల కాలనీలోని ఏకలవ్య నగర్ నామకరణ బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం స్థానిక కాలనీ ప్రాంగణంలో కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు శాస్త్రోక్తంగా భూమిపూజ చేశారు.దీనితో పాటు, 8వ వార్డు యూనిట్ ఇన్చార్జ్ కదిరికోట షాలెం రాజు ఇంటి ముందు రూ. 10 లక్షల ప్రత్యేక నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, కాలనీల్లో తాగునీరు, డ్రైనేజీ, సిసి రోడ్ల సమస్యలను విడతల వారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్ల పనులను కాంట్రాక్టర్లు, అధికారులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వార్డు ఇన్చార్జీలు, మున్సిపల్ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన 'కృషి' విద్యా సంస్థలు







**సూర్య ఉదయం ప్రతినిధి కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 5 :** కృషి గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. భారత మాజీ ఉప రాష్ట్రపతి, మహానీయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సేవలందిస్తున్న ఉపాధ్యాయులందరినీ ఘనంగా సత్కరించి, గౌరవ పూర్వక జ్ఞాపికలను అందించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ పొరంకి మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అతుల్యమైనదని కొనియాడారు. సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ, వంద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×) సాంకేతికతలు కూడా ఒక ఉపాధ్యాయునితో సమానం కాలేవని స్పష్టం చేశారు. గురువుల పట్ల ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడూ అత్యంత గౌరవంతో మెలగాలని ఆయన సూచించారు.ఈ వేడుకల్లో భాగంగా ఉపాధ్యాయులకు నిర్వహించిన ఆటల పోటీలు, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ పొరంకి నాదియా, ప్రిన్సిపాల్ వి.ఎన్.వి.వి. లక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, ఇన్‌ఛార్జ్ మహేష్‌లతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు అత్యంత వేడుకగా, విజయవంతంగా ముగిశాయి.

## లోక్ అదాలత్ ద్వారా కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి

**- జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్**

**సూర్య ఉదయం ప్రతినిధి, మహబూబ్‌నగర్:** లోక్ అదాలత్ ద్వారా చట్టపరంగా రాజీకి అవకాశం ఉన్న




కేసులను సత్వరంగా పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ సూచించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం కోర్టు లైజన్ అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులతో ఎస్పీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 12, 2026న నిర్వహించనున్న లోక్ అదాలత్ పై అధికారులకు పలు సూచనలు చేశారు. లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించేందుకు అనుకూలంగా ఉన్న కేసులను ముందుగానే గుర్తించి, కక్షిదారులతో సమన్వయం చేసుకుని సమర్థవంతమైన కౌన్సిలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఇరుపక్షాల అంగీకారం, చట్టపరమైన అవకాశం ఉన్న కేసుల్లో మాత్రమే రాజీ మార్గం ద్వారా పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు.కేసులు సంవత్సరాల తరబడి కోర్టుల్లో కొనసాగడం వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు, శ్రమ వృథా కావడంతో పాటు కుటుంబ సభ్యులపై మానసిక ఒత్తిడి పెరుగుతుందని ఎస్పీ అన్నారు. చిన్నచిన్న వివాదాలు దీర్ఘకాలిక కక్షలకు దారితీయకుండా సామరస్యపూర్వక పరిష్కారం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించాలని సూచించారు. కక్షిదారులపై ఎలాంటి ఒత్తిడి, బలవంతం చేయకుండా, వారికి పూర్తి వివరాలు తెలియజేసి స్వచ్ఛందంగా, చట్టబద్ధంగా పరిష్కారానికి ముందుకు వచ్చేలా కౌన్సిలింగ్ చేయాలని అధికారులకు సూచించారు. అలాగే కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, చార్జిషీట్‌ల దాఖలు, సమన్లు, వారెంట్ల అమలు, సాక్షుల హాజరు తదితర అంశాల్లో సంబంధిత కోర్టు సిబ్బందితో సమన్వయం చేసుకుని కేసుల పురోగతిని వేగవంతం చేయాలని ఆదేశించారు. "ఒక కేసు ముగియడం అంటే కేవలం ఒక ఫైల్ మూసివేయడం కాదు.. రెండు కుటుంబాల మధ్య ఉన్న వివాదానికి శాశ్వత పరిష్కారం చూపించడం" అని ఎస్పీ పేర్కొన్నారు. చట్టపరంగా పరిష్కరించదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా సత్వరంగా పరిష్కరించి, ప్రజలకు సమయం, ధనం, శ్రమ ఆదా చేయడంతో పాటు సమాజంలో శాంతి, సామరస్యాలను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డి. జానకి పిలుపునిచ్చారు.


# అంతా అయోమయమే 'సర్' ఎన్యూమరేషన్ తరహాలోనే గందరగోళంగా నోటీసుల ప్రక్రియ

**గందరగోళంగా సాగుతోన్న ఎస్ ఐఆర్ నోటీసుల ప్రక్రియ**

**క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం, అవగాహన లోపంతో సమస్యలు**

**రెండు విడతల్లో అవగాహన కల్పించాలని ఈసీ నిర్ణయం**

**ఇవాళ, రేపు తొలి విడత క్యాంపులు**



ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ గందరగోళంగా సాగుతోంది. ఎన్యూమరేషన్ దశలో చుక్కలు చూపించగా, ఇప్పుడు నోటీసుల ప్రక్రియ కూడా అదేవిధంగా జరుగుతోంది. క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం, అవగాహన లోపం అడుగడుగునా కనిపిస్తోంది. అభ్యంతరాలు, క్లెయిమ్‌లు భారీగా వస్తుండగా నోటీసులు, హియరింగ్ మందకొడిగా సాగుతోంది. కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయించిన డాక్యుమెంట్లకు భిన్నంగా బీఎల్వోలు మరికొన్ని కూడా తీసుకొని అప్‌లోడ్ చేస్తున్నారు. ఓటర్లకు అవగాహన కల్పించడంతో పాటు దరఖాస్తుల స్వీకరణ కోసం ఇవాళ, రేపు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. ఇళ్లకు వెళ్లకుండానే షిఫ్ట్ కేటగిరీలోకి రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ అయోమయంగా జరుగుతోంది. ఓటు ఉంటుందా పోతుందా అనే ఆందోళనలు కలిగించేలా కొనసాగుతోంది. ఎస్ఐఆర్‌లో భాగంగా జులై 25 నుంచి ఆగస్టు 10 వరకు జరిగిన ఎన్యూమరేషన్ ప్రక్రియ గందరగోళంగానే జరిగింది. ఎన్యూమరేషన్ ఫారాలు ఇంటింటికీ ఇవ్వాలని ఈసీ చెప్పినప్పటికీ పలు ప్రాంతాల్లో తీవ్ర నిర్లక్ష్యం కనిపించింది. ఇళ్ల వద్దకు వెళ్లకుండా ఓటరు ఆ అడ్రస్ నుంచి షిఫ్ట్ అయ్యారని నమోదు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎన్యూమరేషన్ దశలోనే 73.39 లక్షల ఓట్లు పోయాయి. అందులో సుమారు 62 శాతం అంటే 45 లక్షలకు పైగా ఓటర్లను షిఫ్ట్ కేటగిరీలోనే చేర్చారు. ఓటు నమోదుకు కొత్తగా 4 లక్షల మంది ప్రస్తుతం అభ్యంతరాలు, క్లెయిమ్‌లు, నోటీసుల దశ కొనసాగుతోంది. ఇప్పటికే సుమారు 9.5 లక్షల మంది అభ్యంతరాలు, క్లెయిమ్‌లు నమోదు చేశారు. దాదాపు 4 లక్షల మంది కొత్తగా ఓటు కోసం నమోదు చేసుకున్న వారు కాగా, మరో నాలుగున్నర లక్షలకు పైగా అడ్రస్, ఇతర వివరాలు మార్పు చేయాలని కోరారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌లు సమర్పించేందుకు ఈ నెల 15 వరకే గడువు ఉంది. గడువును పొడిగించాలని సీఎంతో పాటు వివిధ పార్టీల నేతలు రాష్ట్ర ఈసీని కోరుతున్నారు. నోటీసులు జనరేట్ కావడానికే వారం రోజులు ఎన్యూమరేషన్ తరహాలోనే నోటీసుల ప్రక్రియ కూడా గందరగోళంగా జరుగుతోంది. గతంలో 2002లో జరిగిన ఎస్ఐఆర్ వివరాలు ప్రస్తావించని వారితో పాటు పేరు, తండ్రి పేరు, వయసు తదితర వివరాల్లో తేడా ఉన్న 92.87 లక్షల మందికి నోటీసులు జనరేట్ అయ్యాయి. ముసాయిదా జాబితాలో పేరు ఉన్నప్పటికీ నోటీసులకు వివరణ ఇచ్చి, ఆధారాలు సమర్పిస్తేనే తుది జాబితాలో ఓటు ఉంటుంది. అయితే నోటీసుల జారీ, హియరింగ్ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17 నుంచే నోటీసులు ఇవ్వాలి. కానీ పలు జిల్లాల్లో నోటీసులు జనరేట్ చేయడానికే వారం రోజులకు పైగా సమయం పట్టింది. ఇప్పటికీ సుమారు 35 లక్షల మందికి నోటీసులు ఇవ్వగా, దాదాపు 2 లక్షల ఓటర్లకు మాత్రమే హియరింగ్ పూర్తయింది. ఓటర్లకు వ్యక్తిగతంగా నోటీసులు ఇవ్వాలని సీఈవో కార్యాలయం స్పష్టంగా ఆదేశించినా, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ముఖ్యంగా హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాలు, పట్టణాల్లో బీఎల్‌వోలు ఇళ్లకు వెళ్లకుండా ఓటర్లకు ఫోన్‌లు చేసి నోటీసులు తీసుకెళ్లాలని చెబుతున్నారు. ఈ ధ్రువపత్రాలను ఈసీ ఆమోదిస్తుందా విచారణ ప్రక్రియ కూడా గందరగోళంగానే జరుగుతోంది. చాలా ప్రాంతాల్లో బీఎల్వోలే హియరింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఓటు అర్హతను ధ్రువీకరించేందుకు 12 డాక్యుమెంట్లను ఈసీ నిర్ణయించింది. అయితే వాటిలో లేని రేషన్ కార్డు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్ వంటివి కూడా తీసుకుంటున్నారు. బీఎల్వోలు అప్‌లోడ్ చేస్తున్నప్పటికీ చివరకు ఈసీ ఆమోదిస్తుందా లేదా అనే అయోమయం నెలకొంది. వృద్ధులు, రోగులు, కుటుంబ సభ్యులతో పంపించినా సరిపోతుందని సీఈవో కార్యాలయం చెబుతుండగా, కొందరు బీఎల్వోలు అంగీకరించడం లేదు. మొక్కుబడిగా గ్రామసభలు నోటీసుల్లో పేర్కొన్న సమయానికి హియరింగ్‌కు వెళ్లలేకపోయిన వారు కూడా లక్షల్లో ఉన్నట్లు తెలుస్తోంది. మళ్లీ నోటీసులు ఇస్తారా లేదా అనే ఆందోళన ఆ ఓటర్లలో నెలకొంది. అసలు తమ పేరు అన్నీ సరిగ్గా ఉన్న సుమారు కోటీ 71 లక్షల ఓట్లలో ఉందా లేక నోటీసుల జాబితాలో ఉందా అనేది కూడా ఓటర్లకు అర్థం కావడం లేదు. గతంలో ఎన్యూమరేషన్ ఫారాలు చాలా మందికి అందలేదు. ఓటర్లలో అనుమానాల నివృత్తి కోసం గత నెల 27న రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సభలు ఏర్పాటు చేసినప్పటికీ, అవి మొక్కుబడిగా జరిగాయి. బీఎల్వోలు సభల్లో ప్రజలకు ముసాయిదా జాబితా చదివి వినిపించాలని ఈసీ చెప్పినప్పటికీ పలు ప్రాంతాల్లో స్వయంగా చదువుకోవాలని జాబితా ఇవ్వడంతో గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది ఇబ్బందిపడ్డారు. దీంతో పాటు కొత్త ఓటు నమోదు, సవరణ కోసం ఫారాలను అందుబాటులో పెట్టలేదు. రెండు విడతల్లో క్యాంపుల ఏర్పాటు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ప్రత్యేక శిబిరాలు పెట్టాలని సీఈవో కార్యాలయం నిర్ణయించింది. ఇవాళ, రేపు మొదటి విడత, ఈ నెల 12, 13 తేదీల్లో రెండో విడత క్యాంపులు జరగనున్నాయి. శిబిరాల్లో ముసాయిదా జాబితా, తొలగించిన ఓటర్ల వివరాలు అందుబాటులో ఉంటాయని సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లను సమర్పించవచ్చునన్నారు. కొత్తగా ఓటు నమోదు, చిరునామా, ఇంటి పేరు, తదితర వివరణ, సవరణల కోసం కూడా ఫారం 6, 7, 8లు అందుబాటులో ఉంటాయన్నారు.

# బొల్లారం రెజిమెంట్ ఆయుధ చోరీలో ఉగ్ర కుట్ర రంగంలోకి దిగిన ఎన్ఐఏ

**ఆయుధాల చోరీలో ఉగ్రకోణంపై దర్యాప్తు చేపట్టిన ఎన్ఐఏ**

**అధికారుల ఆదేశాలు లేకుండానే రోజూ నిర్దిష్ట సమయాల్లో సీసీ కెమెరాలు ఆపేసినట్లు గుర్తింపు**

**చోరీ జరిగిన రోజు విధుల్లో ఉన్న సిబ్బందికి ప్రశ్నలు**



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బొల్లారం రెజిమెంట్ చోరీ మిస్టరీ వీడలేదు. ఘటన జరిగి 4 రోజులు గడిచినా ఇప్పటి వరకూ ఆయుధాలు దొరకలేదు. అనుమానితుల ఆచూకీ లభ్యం కాలేదు. వందల మందిని విచారిస్తున్నా, ఎన్ఐఏ మొదలు అనేక దర్యాప్తు సంస్థలు దర్యాప్తులో పాల్గొంటున్నప్పటికీ కేసులో పురోగతి లేకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. మరోవైపు ఆయుధాలు భద్రపరిచే గదిలోని సీసీ కెమెరాలు ఆఫ్ చేయడం, అదే సమయంలో రికార్డుల నిర్వహణలో లోపాలు బయటపడటం అనుమానాలకు తావిస్తోంది. సుమారు 10 రోజులుగా కెమెరాలు ఆఫ్ అయినట్లు గుర్తించడంతో ఈ రెండు పరిణామాలకు ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఉగ్ర కోణం ఏమైనా ఉందా సికింద్రాబాద్ బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాలు నిల్వ చేసే 'కోట్ ' కేంద్రంగా దర్యాప్తు కొనసాగుతోంది. ఘటన జరిగి 4 రోజులు గడచినా దర్యాప్తులో ఎలాంటి పురోగతి కనిపించలేదు. మొదట్లో ఒకరి కంటే ఎక్కువ మంది చోరీకి పాల్పడి ఉంటారని, లోపలి వ్యక్తుల సహకారం లేకుండా అంత సులభంగా ఆయుధాగారంలోకి ఎవరూ ప్రవేశించడం సాధ్యం కాదన్న కోణంలో అధికారులు దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం ఉగ్రకోణం ఏమైనా ఉందా అన్న అనుమానాలతో జాతీయ దర్యాప్తు సంస్థ కూడా అనధికారికంగా రంగంలోకి దిగింది. బొల్లారం పోలీసులు, మిలిటరీ, ఇంటెలిజెన్స్ బ్యూరో, ఎన్ఐఏ అధికారులు సంయుక్తంగా ఆధారాలు సేకరిస్తున్నారు. కోట్ వద్ద ఎన్ఐఏ అధికారులు కొన్ని ఆధారాలను సేకరించినట్లు తెలుస్తోంది.

**విధుల్లో ఉన్నవారిపై ప్రత్యేక విచారణ :** మద్రాస్ రెజిమెంట్‌లోని కోటె ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రతిరోజూ రాత్రి పదిన్నర గంటల తర్వాత ఆపేసి, తిరిగి ఉదయం 7 గంటల తర్వాత ఆన్ చేస్తున్నట్లు తేలింది. ఇలా చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలూ లేవని తెలుస్తోంది. మరి సీసీ కెమెరాలను ఎవరు ఆపుతున్నారు ఎందుకు ఆపుతున్నారు చోరీ జరిగిన సమయంలోనే కెమెరాలు పని చేయకపోవడానికి కారణమేంటి అన్నదానిపై దర్యాప్తు అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. మద్రాస్ రెజిమెంట్‌లో దాదాపు 800 మంది విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఘటన జరిగిన రోజు రాత్రి కోట్‌తో పాటు రెజిమెంట్‌లో విధుల్లో ఉన్న వారిని ప్రత్యేకంగా ప్రశ్నిస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసి బదిలీ అయిన వారిని కూడా పిలిపించి విచారణ జరుపుతున్నారు. వారి ఫోన్లను సైతం విశ్లేషిస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లభించలేదని తెలుస్తోంది. ఆయుధాలు ఎక్కడున్నాయన్నదే సమస్య మద్రాస్ రెజిమెంట్‌లోని అత్యంత కీలకమైన 'కోట్' నిర్వహణలో అనేక లోపాలు ఉన్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ముఖ్యంగా ఆయుధాలు, మందుగుండుకు సంబంధించిన రికార్డుల నిర్వహణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చోరీ జరిగిన సుమారు 10 రోజుల ముందు వరకూ ఆయుధాలు, మందుగుండుకు సంబంధించిన రికార్డులు సక్రమంగానే ఉన్నాయి. తర్వాత నుంచి వివరాలను నమోదు చేయడంలో నిర్లక్ష్యం జరిగినట్లు దర్యాప్తులో బయటపడింది. దీంతో ఆయుధాలు, తూటాలు ఒకేసారి కాకుండా కొన్ని రోజులుగా కొన్ని కొన్ని బయటకు తరలించి ఉండొచ్చని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అత్యాధునికమైన ఈ ఆయుధాలు బయటకు వెళ్లడం భద్రతా సంస్థలను ఆందోళనకు గురి చేస్తోంది. అయితే ఆయుధాలు చోరీ చేసింది ఎవరన్న దానికంటే అవి ఎక్కడున్నాయనేది అధికారులను మరింత కలవరపెడుతోంది. అన్ని కోణాల్లో విచారిస్తున్న అధికారులు ఆయుధాలు, తూటాలు త్వరగా స్వాధీనం చేసుకోకపోతే భవిష్యత్‌లో ప్రమాదం జరిగే అవకాశం ఉందన్న ఆందోళన అధికారుల్లో ఉంది. అందుకే 4 రోజులు గడిచినా ఫలితం కనిపించకపోయినా దర్యాప్తు సంస్థలు మాత్రం అన్ని కోణాల్లో ఆధారాలను జల్లెడ పడుతున్నాయి. సీసీ కెమెరాల వ్యవహారం, రికార్డుల నిర్వహణలో లోపాలు, లోపలి వ్యక్తుల ప్రమేయం, ఆయుధాల తరలింపు మార్గం, ఉగ్రకోణం ఇలా ప్రతి అంశాన్ని విడివిడిగా పరిశీలిస్తున్నాయి.

# జలాశయాల్లో తగినంత నీళ్లు లేవు, పొదుపుగా వాడుకోండి తెలుగు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ సూచన

**విద్యుత్ ఉత్పత్తి కోసమే నీటిని విడుదల చేయొద్దన్న కేఆర్ఎంబీ**

**పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల నియంత్రించాలన్న కేఆర్ఎంబీ**

**రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలను పరిగణలోకి తీసుకోవాలన్న కేఆర్ఎం**




తెలుగురాష్ట్రాలకు కేఆర్ఎంబీ కీలక సూచనలు చేసింది. విద్యుత్ ఉత్పత్తి కోసమే నీటిని ప్రాజెక్టుల నుంచి దిగువకు విడుదల చేయొద్దని పేర్కొంది. పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదలను నియంత్రించాలంది. రెండు రాష్ట్రాల(ఏపీ, తెలంగాణ) నీటి అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని, ఉమ్మడి జలాశయాల్లో నీరు తక్కువగా ఉన్నందువల్ల పొదుపుగా వాడుకోవాలని సూచన చేసింది. కష్టకాలంలో తాగునీటికే ప్రాధాన్యం ఇవ్వాలని విభజన చట్టం నిర్దేశిస్తోందని కేఆర్ఎంబీ స్పష్టం చేసింది. కృష్ణా జలాల అంశంపై ప్రతిష్టంభన వీడలేదు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పూర్తి స్థాయి బోర్డు సమావేశంలో తేల్చాలని నిర్ణయించారు. రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలు, శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లోని నీటి నిల్వలపై చర్చించేందుకు హైదరాబాద్ జలసౌధలో జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయారు.

**కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేసిన ఏపీ :** శ్రీశైలం నుంచి తెలంగాణ విద్యుదుత్పత్తిపై కృష్ణా బోర్డుకు ఆంధ్రప్రదేశ్ ఫిర్యాదు చేసింది. విద్యుదుత్పత్తికి వాడటం వల్ల నిల్వలు వేగంగా తగ్గుతున్నాయని ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై కేఆర్ఎంబీ స్పందించి తెలంగాణ నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శికి కృష్ణా బోర్డు లేఖ రాసింది. విభజన చట్టంలోని నిబంధనలు ప్రస్తావించింది. విద్యుత్ అవసరాలతో పోలిస్తే సాగునీటికే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. సాగునీటి అవసరాల కంటే తాగునీటికే ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపిం ది. విభజన చట్టం నిబంధనలను గౌరవించి, అమలుచేయాలంది. ముఖ్యంగా తాగునీటి అవసరాలు కాపాడాలని తెలంగాణను కోరింది. తాగునీటి అవసరాలు రక్షించాలని ఇప్పటికే పలుసార్లు చెప్పామని లేఖలో పేర్కొంది.

**మరోసారి భిన్నాభిప్రాయాలు :** కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీశ్ కాంబోజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్ బాబు, ఆంధ్రప్రదేశ్ ఈఎన్సీ నరసింహమూర్తితో పాటు రెండు రాష్ట్రాలకు చెందిన ఇంజినీర్లు హాజరయ్యారు. ప్రస్తుత నీటి లభ్యత, తాగునీటి అవసరాలు, శ్రీశైలం--నాగార్జునసాగర్ జలాశయాల పరిస్థితి, నీటి విడుదలపై సమావేశంలో చర్చ జరిగింది. కృష్ణా జలాల పంపిణీపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య మరోసారి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

**వాడీవేడిగా కేఆర్ఎంబీ సమావేశం :** రెండు రాష్ట్రాలు తమ వాదనలు బలంగా వినిపించడంతో సమావేశాలు వాడివేడిగా సాగింది. పోతిరెడ్డిపాడు, వెలిగొండ సహా ఇతర మార్గాల ద్వారా ఎక్కువ నీటిని తరలించుకుంటున్నారని తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. శ్రీశైలం వద్ద తెలంగాణ జలవిద్యుత్ ఉత్పత్తి చేసి దిగువకు నీటిని వాడుకుంటున్నారని ఏపీ అభ్యంతరం వ్యక్తం చేసిం ది. నీటి వాటా విషయంలో ఇరు రాష్ట్రాలు తమ తమ వాదన లకే కట్టుబడటంతో ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ఈ అంశా లను సెప్టెంబర్ నాలుగో వారంలో నిర్వహించే బోర్డు పూర్తి స్థాయి సమావేశంలో విస్తృతంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు.

**పాత నిష్పత్తి సరికాదని వాదన :** ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి అవసరాల కోసం కృష్ణా జలాలను 50:50 నిష్పత్తిలో పంచాలని తెలంగాణ కోరింది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ ఈఎన్సీ రమేశ్ బాబు పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో పాత 66:34 నిష్పత్తిని అమలు చేయడం సరికాదని తెలంగాణ వాదించింది. రాష్ట్ర అవసరాల దృష్ట్యా తెలంగాణకు మొత్తం 200 టీఎంసీల నీరు అవసరమని, అందుకు అనుగుణంగా నీటి కేటాయింపులు చేయాలని కోరినట్లు రమేశ్ బాబు తెలిపారు. 66:34 నిష్పత్తిని గత మూడేళ్లుగా తెలంగాణ అంగీకరించడం లేదు. పోతిరెడ్డిపాడు నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ నీటిని తరలిస్తోంది, ప్రస్తుతం వెలిగొండ నుంచి కూడా నీటిని తీసుకుంటోంది. ఈ అంశాలన్నింటినీ సెప్టెంబర్ నాలుగో వారంలో జరిగే కేఆర్ఎంబీ పూర్తి స్థాయి సమావేశంలో సమగ్రంగా చర్చిస్తాం రమేశ్ బాబు, తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్


**ఆ ప్రతిపాదన సహేతుకంగా లేదు :** త్రిసభ్య కమిటీ సమావేశంలో ఏకాభిప్రాయం రాలేదని ఏపీ ఈఎన్సీ నరసింహమూర్తి తెలిపారు. 66:34 నిష్పత్తి ప్రకారం తెలంగాణ, ఏపీకి నీటి విడుదలకు ఉత్తర్వులు ఇవ్వాలని తాము కోరినట్లు చెప్పారు. వచ్చే ఆగస్టు వరకు తమ రాష్ట్ర తాగునీటి అవసరాల కోసం 104 టీఎంసీల నీరు అవసరమని కోరినట్లు వెల్లడించారు. తెలంగాణ 200 టీఎంసీల నీటిని కోరింది, ఆ ప్రతిపాదన సహేతుకంగా లేదు. తెలంగాణకు అవసరం లేకున్నా శ్రీశైలం వద్ద విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. పోతిరెడ్డిపాడు, వెలిగొండ ద్వారా తీసుకుంటున్న నీరు మా రాష్ట్ర వాటా నుంచే తీసుకుంటున్నాం, ఎవరి వాటాను అడగడం లేదు. నరసింహమూర్తి, ఏపీ ఇంజినీర్ ఇన్ చీఫ్

# ఆల్వేస్ వాచింగ్ ఆల్వేస్ రెడీ' భద్రతకు మూడో కన్ను

**అత్యాధునిక సాంకేతికతతో ఏపీ పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్**

**తొలుత 14 వేలకు పైగా సీసీ కెమెరాల అనుసంధానం**

**త్వరలోనే సేవలు అందుబాటులోకి**



ఏపీలో ఏ మూలన ఏం జరిగినా ఇక ఇట్టే కనిపెట్టొచ్చు. ఈ మేరకు రియల్‌టైమ్‌లో తెలుసుకొని సత్వరమే స్పందించేలా అత్యాధునిక సాంకేతికతతో కూడిన 'ఇంటిగ్రేటెడ్ కమాండ్' సెంటర్‌ను ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ సిద్ధంచేసింది. 'ఆల్వేస్ వాచింగ్– ఆల్వేస్ రెడీ' (నిరంతరం పర్యవేక్షణ – నిరంతరం సిద్ధం) నినాదంతో దీన్ని తీర్చిదిద్దింది. మంగళగిరి పోలీసు ప్రధాన కార్యాలయం నాలుగో అంతస్తులోని ఈ కేంద్రం రాష్ట్ర పోలీసు విభాగానికి నాడీ కేంద్రం (నెర్వ్ సెంటర్)లా పనిచేయనుంది. తొలుత ఏపీ వ్యాప్తంగా 14,000లకు పైగా సీసీ కెమెరాలను ఈ కేంద్రానికి అనుసంధానం చేశారు. వాటిలోని దృశ్యాలను ఇక్కడి నుంచే నిరంతరం పర్యవేక్షించనున్నారు. ఇందుకోసం భారీ వీడియో వాల్ ఏర్పాటుచేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ వంటి సాంకేతికతలతో ఆ దృశ్యాల్ని విశ్లేషించి, క్షేత్రస్థాయికి ఆదేశాలివ్వనున్నారు. పోలీసులు వాడుతున్న డ్రోన్లు చిత్రీకరించే దృశ్యాలనూ ఇక్కడి నుంచే పర్యవేక్షిస్తారు. మరోవైపు ప్రజాభద్రత చట్టం కింద ప్రైవేట్ వ్యక్తులు అమర్చుకున్న లక్షల సీసీ కెమెరాలను వారి అనుమతితో ఈ కేంద్రానికి అనుసంధానించనున్నారు. జిల్లాకొకటి చొప్పున 28 డెస్క్‌లు ఏర్పాటుచేశారు. 'శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ఛేదన, విపత్తుల నిర్వహణ, అత్యవసరాల్లో సత్వర స్పందన, భద్రత, బందోబస్తు క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం వంటి బహుళ సేవలను 'ఇంటిగ్రేటెడ్ కమాండ్' అందిస్తుంది. అన్ని జిల్లాల సమాచారాన్ని ఒకే పాయింట్‌లో రియల్‌టైమ్‌లో పర్యవేక్షించేలా తీర్చిదిద్దిన ఈ కేంద్రం సేవలను త్వరలోనే అందుబాటులోకి తెస్తామ'ని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు.

**హాట్‌స్పాట్‌ల గుర్తింపు :** ఏపీ వ్యాప్తంగా జరుగుతున్న నేరాల సరళిని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ సాంకేతికతల ద్వారా ఈ సెంటర్ విశ్లేషణ చేస్తుంది. ఒకే తరహా నేరాల మధ్య సంబంధాన్ని గుర్తిస్తుంది. జియో–స్పేషియల్ డేటా సాయంతో నేరాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలు, వీధులు, సమయాలను డిజిటల్ మ్యాప్‌పై హాట్‌స్పాట్‌లుగా సూచిస్తుంది. తద్వారా పోలీసులు గస్తీ నిర్వహించేలా ఆదేశాలు జారీ చేస్తుంది. అగ్నిప్రమాదాలు, వరదలు, తుపాన్లు, ఇతర ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు జిల్లాల నుంచి వచ్చే అత్యవసర సమాచారాన్ని క్రోడీకరించి ఉన్నతాధికారులకు చేరవేస్తుంది. ప్రతి జిల్లాలోని ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక దళాలు, అంబులెన్సులు, రెస్క్యూ బోట్లు, హెలికాప్టర్ల లభ్యతను డిజిటల్ మ్యాపింగ్‌లో పర్యవేక్షిస్తుంది. పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు ప్రభావిత ప్రాంతాల్లోని పోలీసులతో లైవ్‌లో మాట్లాడొచ్చు. పోలీసు, రెవెన్యూ, విపత్తు నిర్వహణ, వైద్యారోగ్యశాఖ, నేవీ, కోస్ట్ గార్డ్ విభాగాలను ఏకకాలంలో సమన్వయం చేసుకోవచ్చు. కమ్యూనికేషన్ డిస్పాచ్ హబ్‌గా ఈ కేంద్రం పనిచేస్తుంది.

## తిరుమలలో భక్తుల వెల్లువ.. దర్శనానికి 20 గంటల నిరీక్షణ

**వారాంతం కావడంతో తిరుమలకు పోటెత్తిన భక్తులు**

**నిండిపోయిన వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు**

**శుక్రవారం రోజు హుండీ ఆదాయం రూ.4.03 కోట్లు**

**క్యూలైన్లలో భక్తులకు ఆహారం, తాగునీరు అందిస్తున్న టీటీడీ**



వారాంతం కావడంతో తిరుమల గిరులు భక్తులతో కిక్కిరిశాయి. దేశం నలుమూలల నుంచి శ్రీవారి దర్శనం కోసం యా త్రికు లు భారీ సంఖ్యలో తరలిరావడంతో కొండపై తీవ్ర రద్దీ నెలకొ ంది. వైకుంఠం క్యూ కాంప్లె క్స్‌లోని అన్ని కంపా ర్ట్‌మెంట్లు నిండిపోవడంతో, క్యూలైన్లు వెలుపలికి విస్తరించాయి. ప్రస్తుతం టోకెన్లు లేని సాధారణ సర్వదర్శనం భక్తులకు శ్రీవారి దర్శనం కోసం సుమారు 20 గంటల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో భక్తులు కాలినడక మార్గాలు, బయట రింగు రోడ్డు వరకు ఉన్న క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ అధికారులు నిరంతరం పాలు, తాగునీరు, అల్పాహారం అందజేస్తూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇక శుక్రవారం ఒక్కరోజే 68,374 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 35,241 మంది తలనీలాలు సమర్పించారు. హుండీ ద్వారా రూ.4.03 కోట్ల ఆదాయం లభించినట్లు టీటీడీ వెల్లడించింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని వృద్ధులు, చంటి పిల్లల తల్లిదండ్రులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తమ ప్రయాణాన్ని, దర్శనాన్ని తగిన జాగ్రత్తలతో ప్లాన్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

## వైసీపీ మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాపై ఎస్సీ ఎస్టీ కేసు

**గోపాలపురం ఎమ్మెల్యే వెంకటరాజుపై తీవ్ర వ్యాఖ్యలు**

**వైఎస్సార్ వర్ధంతి సభలో ఘటన**

**టీడీపీ నేత ఫిర్యాదుతో కేసు నమోదు**



వైసీపీ నేత, రాజా నగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా న్యాయపర మైన చిక్కుల్లో పడ్డారు. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల పోలీస్ స్టేషన్‌లో ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదైంది. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజును కించపరిచేలా వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 2వ తేదీన దూబచర్లలో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సభలో పాల్గొన్న జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజును ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యాఖ్యలపై దూబచర్ల తెలుగుదేశం పార్టీ నాయకుడు బోడిగడ్ల నాగరఘు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు జక్కంపూడి రాజాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయబాబు ధ్రువీకరించారు.

## హైదరాబాద్ జేఎన్టీయూలో విద్యార్థుల మధ్య తీవ్ర ఘర్షణ.. కర్రలతో దాడులు

**రెండు వర్గాలుగా విడిపోయి పరస్పరం దాడులు**

**తీజ్ వేడుకల్లో మొదలైన వివాదం అర్ధరాత్రి కొట్లాటకు దారి**


**19 మందిపై కేసులు నమోదు, 8 మంది విద్యార్థుల అరెస్ట్**

**పాత కక్షలతో పాటు యువతి వ్యవహారంపైనా పోలీసుల విచారణ**



హైదరాబాద్‌లోని జేఎన్టీయూ క్యాంపస్ విద్యార్థుల ఘర్షణతో రణరంగంగా మారింది. గురువారం అర్ధరాత్రి రెండు వర్గాలకు చెందిన విద్యార్థులు కర్రలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులు గాయపడగా, వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు 19 మంది విద్యార్థులపై కేసులు నమోదు చేసి, 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. గురువారం సాయంత్రం క్యాంపస్‌లో నిర్వహించిన తీజ్ వేడుకల్లో ఇద్దరు విద్యార్థుల మధ్య మొదలైన చిన్న వాగ్వివాదానికి పాత కక్షలు కూడా తోడవడంతో తీవ్ర ఘర్షణకు దారితీసింది. రాత్రి సుమారు 2:30 గంటల సమయంలో మంజీరా హాస్టల్‌కు చెందిన కొందరు విద్యార్థులు, గౌతమి హాస్టల్‌పై దాడి చేశారు. అక్కడి విద్యార్థులను గదుల్లోంచి బయటకు పిలిచి కర్రలతో దాడికి పాల్పడ్డారు. సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నా ఫలితం లేకపోయింది. ఈ ఘటనపై రెండు వర్గాలు పరస్పరం ఫిర్యాదు చేసుకోవడంతో పోలీసులు మూడు వేర్వేరు కేసులు నమోదు చేశారు. పాత గొడవల నేపథ్యంలోనే ఈ ఘర్షణ జరిగిందని, ఓ యువతికి సంబంధించిన కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నామని డీసీపీ రీతిరాజ్ తెలిపారు. ఘర్షణ సమయంలో ఓ విద్యార్థి మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించామని, దీనిపైనా విచారణ జరుపుతున్నామన్నారు. మరోవైపు, ఈ ఘటనపై విచారణ కమిటీని ఏర్పాటు చేశామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని జేఎన్టీయూ ప్రిన్సిపల్ డాక్టర్ జి.వి. నరసింహారెడ్డి స్పష్టం చేశారు. పరారీలో ఉన్న మిగతా విద్యార్థుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# మానని గాయానికి మందు




వినాశనం, విస్ఫోటనం మధ్య చిక్కుకున్నది మానవ జీవితం. ఇలాంటి పరిస్థితుల్లో ఎలా చిక్కుకున్నామని ఒక్కసారి మనల్ని మనం ప్రశ్నించుకుంటే.. మనుషులకు మధ్య దూరం ఎలా పెరిగిందో సులభంగా అర్థమవుతుంది. మనిషి మూరత్వ ఆలోచనలే ఇందుకు కారణం. దీనివల్ల ఈ ఆధునిక కాలంలో కూడా కొన్ని సమూహాలు ఇంకా నలిగిపోతూనే ఉన్నాయి. అలాంటి వారి గాయాలకు పసునూరి కథలు మందు రాస్తాయనడంలో సందేహం లేదు. పసునూరి రచనల్లో శ్రమైక జీవన సౌందర్యం ఉన్నది. కథల్లో జీవం ఉన్నది కాబట్టే అతని రచనలు అంత చిక్కగ ఉంటాయి. శ్రమజీవుల నుంచి పుట్టిన ప్రతీ వాక్యం సజీవంగా ఉంటుంది. కొన్నేండ్ల పాటు కాదు, కొన్ని తరాలనే శాసిస్తుంది. అట్లా పసునూరి రచించిన 'కండీషన్స్ అప్లయ్' పుస్తకంలోని కథలు ఆధునిక దళితుల గోసలను కండ్ల ముందుంచుతాయి. 2జీ నుంచి 5జీకి వచ్చినా మారిందేమీ లేదు. జనరేషన్ మారిందే తప్పా.. మనిషిలో ఇసుమంత కూడా మార్పు రాలేదు. ఇక్కడ కులోన్మాదం అనే మాయరోగం కరోనా కంటే వేగంగా విస్తరిస్తోందనే చేదునిజాన్ని చాటుతున్నాయి 'కండీషన్స్ అప్లయ్' పుస్తకంలోని కథలు. పాదం కింద ఒక నినాదం మొలుస్తుందనేది అక్షర సత్యం. ఊరు కాని ఊరు. దేశం కాని దేశం దాటి మనుషులను ముక్కలుగా చేస్తుంది. మనిషికి మనిషికి మధ్య దూరాన్ని పెంచుతోంది. ప్రయోగశాలలు, వైద్యాలయాల్లో కూడా అంటరానితనం ఇంకా అలానే ఉందనడంలో సందేహం లేదు. అద్దె గర్భం ద్వారా పుట్టే బిడ్డను కూడా కులమతాలతో వేరు చేస్తున్నారు ఈ కులోన్మాదులు. అమ్మతనాన్ని సైతం మైక్రోస్కోప్‌తో పరీక్షించే తరహాలో ఉంది నేటి సమాజం. తన కులానికి చెందినవారి ద్వారానే దాన్ని కొనేందుకు ప్రయత్నిస్తుంది కులోన్మాదం. కడుపుకే కనులుంటే కడుపు కోత అనుభవించేదా అని ప్రశ్నించేదే ఇందులోని 'కండీషన్స్ అప్లయ్' కథ. ఊరిలో అంబేద్కర్ విగ్రహం పెట్టనివ్వకుండా దొర కుట్ర చేస్తే బహుజనులు తిప్పికొట్టిన ఒక ఉద్యమానికి స్ఫూర్తినిచ్చింది 'ధమ్కీ' కథ. ఆకలిని తట్టుకోలేక ఆకులు తిన్న లింగడిని ఆదుకోవాల్సింది పోయి, అతని ఆకలిని దైవత్వంతో పోల్చడం సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయం. ఇలాంటి సంఘటనను చూపించిందే 'లీఫ్ మ్యాన్' కథ. పల్లె నుంచి పట్నం దాకా, పాఠశాల నుంచి విశ్వవిద్యాలయాల వరకు కులోన్మాద విషం ఎంతలా విస్తరించిందో 'ప్యూర్లీ నాన్ వెజిటేరియన్' కథ వివరిస్తుంది. కట్టుకథలు, అసత్య ప్రచారాలతో మతకల్లోలాలు జరుగుతాయని చెప్పేదే 'వాట్సప్ స్ట్రీట్స్' కథ. ఇట్లా 'కండీషన్స్ అప్లయ్' పుస్తకంలో మొత్తం 19 కథలున్నాయి. మొదటి కథ 'లీఫ్ మ్యాన్' కాగా, ఆఖరిది 'వెంటాడే పాట'. నిన్ను నువ్వు నిరూపించడానికి సాహసిస్తే, నువ్విక ఒంటరిగా మిగలవంటూ ధైర్యాన్నిస్తాయని చెప్తుందీ పుస్తకం.

# చక్కని అనుబంధానికి జపనీయుల సీక్రెట్ - ఇదేనట!

**'మా' థియరీ పాటిస్తే ఇద్దరి మధ్యా ప్రేమానురాగాలు**

**దంపతుల మధ్య హెల్దీ బాండింగ్ కోసం సూపర్ టిప్స్!**



మన వివాహ వ్యవస్థకు ప్రపంచ వ్యాప్తంగా పేరుంది. కానీ, పటిష్టమైన బంధాలంటే మాత్రం జపనీయులనే గుర్తు చేసుకుంటారు. వాళ్ల అనుబంధం అలాంటిది మరి! అందుకు వాళ్లేమీ పెద్దపెద్ద ఆచారాలు పాటించారు, త్యాగాలు చేయరు. కానీ, వారు 'మా' సూత్రాన్ని పాటిస్తారని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో 'మా' సూత్రం అంటే ఏమిటి చక్కని అనుబంధానికి ఈ సూత్రం ఎలా ఉపయోగపడుతుందో ఇప్పుడు తెలుసుకుందాం!ముచ్చటైన దాంపత్యం అంటే 'ఎప్పుడూ కలిసే గడపాలి. మెసేజ్‌ల్లో ఊసులు దొర్లుతుండాలి. ఆ రోజు ఏం జరిగిందో ప్రతిదీ ఒకరితో మరొకరు పంచుకోవాలి' అని చాలామంది నమ్ముతుంటారు. కానీ, జపనీస్ 'మా' సూత్రం చెప్పే కోణం వేరట. ఇద్దరి మధ్యా కాస్త దూరం ఉండాలని అంటుంది. అసలు 'మా' సూత్రం అంటే.. కాస్త దూరం, చిన్న విరామం, నిశ్శబ్దం అని అర్థం.భార్యాభర్తలు అన్నాక ఇద్దరూ గొడవ పడటం సర్వసాధారణమే. కొన్ని సార్లు చిన్న గొడవ కావొచ్చు. కానీ మాటామాటా పెరిగి.. పెద్దది కావచ్చు. అదే ధోరణి కొనసాగితే ఇద్దరి మధ్యా దూరం పెరగవచ్చని నిపుణులు చెబుతున్నారు. అది కాస్త విడాకులు దాకా కూడా రావొచ్చు. ఇక్కడ సమస్య ఇద్దరి మధ్య ప్రేమ లేకపోవడం కాదట. ఇలాంటప్పుడు బయటికి వచ్చిన దురుసు మాటలు అని అంటున్నారు.నిజానికి, ఏదైనా వాదన మొదలైనప్పుడు శరీరంలో ఒత్తిడి హార్మోన్లు పెరుగుతాయని పేర్కొంటున్నారు. ఆ సమయంలో మెదడు ఏదీ వినడానికి ఇష్టపడదని వివరిస్తున్నారు. అందుకే, తనని తాను రక్షించుకునే పనిలో ఎదురుదాడికి దిగుతుందని తెలియజేస్తున్నారు. అలా పదునైన మాటలు బయటికి వస్తాయట. కానీ, జపనీస్ 'మా' సూత్రం ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేస్తుందట. ఈ షేర్డ్ సైలెన్స్‌లో ఇద్దరూ ఏదైనా సమస్య వచ్చినప్పుడు మాట్లాడరని చెబుతున్నారు. నిశ్శబ్దంగా పాటిస్తారట. ఫోన్ కాదు కదా, నేరుగా కళ్లలోకీ చూడరని అంటున్నారు. తద్వారా క్రమంగా మనసు నెమ్మదిస్తుందని తెలియజేస్తున్నారు. నిరూపించుకోవాలన్న తొందర పోతుందని వివరిస్తున్నారు. ఇదే 'మాల్' రూల్ అని పేర్కొంటున్నారు. దీన్ని పాటించి, విడాకుల వరకూ వెళ్లి తిరిగి సంసారాన్ని చక్కబెట్టుకున్న దంపతులు కూడా ఉన్నారట.అలాగని భాగస్వామితో మౌన యుద్ధం, పట్టించుకోకపోవడం లాంటివి చేయమని కాదు. మాటా మాటా పెరిగే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు. అంతేకానీ, అసలు మాట్లాడకపోవడం, భావోద్వేగాలకు దూరంగా ఉండాలని కాదంటున్నారు. ఇద్దరికీ అనుకూలంగా కొంత స్పేస్ ఏర్పరచుకోవడమని తెలియజేస్తున్నారు. ఆవేశం తగ్గాక నెమ్మదిగా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచిస్తున్నారు. ఎలాగంటే, మీకు గార్డెనింగ్ అంటే ఇష్టం, మీ భాగస్వామికి పుస్తకమంటే మక్కువ. అయితే, ఫలానాదే చేయమని ఒకరినొకరు ఇబ్బంది పెట్టకోవద్దట. ఎవరికి నచ్చింది వాళ్లు చేసుకోవాలని సలహా ఇస్తున్నారు. తరవాత కలిసి భోజనం చేయడం, కబుర్లు చెప్పుకోవడం వంటివి చేస్తారని వివరిస్తున్నారు.ఎంత గొప్ప అనుబంధమైనా కానీ, ఇరువురి మధ్య ఎంత చేరికైనా ఉండనీ.. ఆరోగ్యకరమైన దూరం ఉండాలదే 'మా' సూత్రం. అప్పుడే దంపతుల మధ్య అపార్థాలు ఉండవని నిపుణులు చెబుతున్నారు. ఒకరిపై మరొకరికి నమ్మకం, గౌరవంతో పాటు స్వతంత్ర భావాలు సాధ్యమవుతాయంటున్నారు. ముఖ్యంగా, అందుబాటులో ఉన్న సమయాన్ని పూర్తిగా ఆస్వాదించగలుగుతారని తెలియజేస్తున్నారు. ఇద్దరికీ ఎదిగే ఆ స్వేచ్ఛ ఉన్నప్పుడే ఒకరికొకరు ఆనందాన్ని పంచగలుగుతారని, సానుకూల బంధమూ ఏర్పడుతుందని తెలియజేస్తున్నారు.భార్యభర్తల ప్రేమకి అన్నిసార్లూ మాటలే తప్పనిసరి కాదట. శ్రద్ధ, ఓపిక, అవతలి వ్యక్తికి కావాల్సిన ఏకాంతం ఇవ్వడం లాంటి ఉండాలంటున్నారు నిపుణులు. ఆ ఏకాంతం కూడా ఇద్దరి మధ్య ప్రేమ పెరిగేలా ఉండాలని సూచిస్తున్నారు. ఇదే 'మా' తత్వమని వివరిస్తున్నారు.

# ఇది కదా ఐలమ్మ ఆశయం!



రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తికావడంతో ఇటీవల ఘనంగా విజయోత్సవాలు జరుపుకొన్నది. అధికారంలోకి రాగానే చే(ఆరు) గ్యారెంటీల అమలుపై దృష్టిపెట్టిన కాంగ్రెస్ సర్కార్ వాటిలో ఒక్కటి, రెండు మాత్రమే, అవి కూడా అరకొరగా అమలుచేసింది. దీంతో ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. పాలకులం కాదు, సేవకులమని కాంగ్రెస్ నాయకులు మొదటినుంచీ చెప్తున్నారు. తమది ప్రజా పాలన అని చెప్తూ ప్రజాదర్బార్‌లు కూడా నిర్వహించారు. ఇది ప్రజాపాలనకు నిదర్శనమని వందిమాగధులు వంత పాడుతున్నారు. ముఖ్యమంత్రి కూడా ప్రజల్లో కాంగ్రెస్‌ప్రాబల్యం తగ్గకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నా రు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం న్యూయార్క్ వలె మారబోతున్నదని ప్రకటించారు. అంతేకాదు, మన దేశంలోని రాష్ట్రాలతో కాదు, ఇతర దేశాలతో తాము పోటీ పడుతున్నామని కూడా సెలవిచ్చారు. గత ప్రభుత్వం ప్రకటించిన నోటిఫికేషన్ల ద్వారా 55 వేల ఉద్యోగాలు భర్తీచేసి అపాయింట్‌మెంట్ ఆర్డర్లకు ఎల్బీ స్టేడియాన్ని అడ్డాగా మార్చారు. అయితే, మాటలు చెప్పడం సులువే, అమలు, ఆచరణే కష్టం. చాకలి ఐలమ్మ వర్ధంతి సభలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా ఆమె మనమరాలును నియమిస్తున్నామని సీఎం ప్రకటించారు. ప్రతిష్టాత్మక కోఠి మహిళా కళాశాలకు ఐలమ్మ పేరు పెట్టడం ఆమెకు నిజమైన నివాళి అని ముఖ్యమంత్రి చెప్పారు. బడుగు, బలహీన వర్గాలకు ఇది కొంతవరకు ఊరటే. దొరల గడీలను బద్దలుకొట్టి, పెత్తం దారీతనానికి పాడె కట్టిన ధీరవనిత ఐలమ్మ. వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ఆమె పోరాడారు. భూస్వామ్య వ్యవస్థను నిర్మూలించాలనే లక్ష్యంతో పోరు సలిపారు. ఐలమ్మకు కావాల్సింది పేరు కాదు, వట్టి హామీలు, మాటల గారడీతో ఈ వర్గాలను మభ్యపెట్టడం అసలు కానే కాదు, ఆయా వర్గాలకు భూములు పంచి, జీవనోపాధి కల్పించి వారి సామాజిక హోదాను పెంచడమే ఐలమ్మ సంకల్పం. అయితే, ఈ వర్గాల బలహీనతలను సొమ్ము చేసుకొని అసలైన అధికారాన్ని భూస్వాములైన పెట్టుబడిదారులు అనుభవిస్తున్నారు. భూమిని పునఃపంపిణీ చేయడం ద్వారా సామాజిక న్యాయాన్ని సాధించవచ్చు. తద్వారా భూ యాజమాన్యంలో ఉండే అసమానతలను రూపుమాపవచ్చు. అందుకే, 'ఒట్టి మాటలు కట్టిపెట్టవోయి గట్టిమేలు తలపెట్టవోయి' అన్న గురజాడ మాటల సాధన చాకలి ఐలమ్మకు అసలైన నివాళి. అదే ఆమె ఆశయం కూడా. 1948 సెప్టెంబర్‌లో భారత్‌లో తెలంగాణ విలీనమైనప్పటికీ, ఎస్టేట్ల చట్టం రద్దయినప్పటికీ, 1973లో అప్పటి కాంగ్రెస్ సర్కార్ భూ పంపిణీ చట్టాన్ని తీసుకువచ్చి, 1975లో ఆ చట్టాన్ని అమలుచేసింది. ఈ రెండేండ్లలో భూస్వాములందరూ తమ భూములను బినామీ పేర్లపై మార్చుకున్నారు. తద్వారా చట్టాల పరిధిలోకి భూములు రాకుండా తప్పించుకున్నారు. దీనికి అప్పటి అధికార, ఉద్యోగ యంత్రాంగం తోడ్పడింది. ప్రస్తుతం పట్టణ భూ పంపిణీ చట్టాలను పూర్తిగా రద్దుచేశారు. దీంతో కొంతమంది భూస్వాములు వందల ఎకరాలను ఆక్రమించి ఫ్యాక్టరీలు, ఫామ్‌హౌజ్‌లు నిర్మించుకొని భూమిని అట్టిపెట్టుకున్నారు. అదే సమయంలో కార్పొరేట్ సంస్థలు ఉనికిలోకి వచ్చాయి. ఇది పాతకాలం నాటి జమిందారీ వ్యవస్థను తలపిస్తుంది. ధరల నిర్ణయంతో పాటు, భూముల కేంద్రీకరణ అంశం ఈ కార్పొరేటీకరణలో ప్రధానంగా ముందుకువచ్చింది. దీన్ని సమర్థిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు కూడా తీసుకువచ్చాయి. తెలంగాణలో ఎస్సీలు సుమారు 14.28 శాతం మంది ఉన్నారు. బీసీలు 40 శాతానికి పైగా ఉన్నారు. ఇతర బలహీనవర్గాలు 20 శాతం వరకు ఉండవచ్చు. మొత్తంగా ఈ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల జనాభా 75 శాతం వరకు ఉంటుంది. కానీ, వీరిలో 29.97 శాతం మంది చేతుల్లో అసలు భూమే లేదు. అయితే, మిగిలిన 45 శాతం మంది చేతుల్లో 30 శాతం సేద్యపు భూమి మాత్ర మే ఉన్నది. మిగిలిన 70 శాతం సేద్యపు భూమి 25 శాత మే ఉన్న భూస్వాముల చేతుల్లో ఉన్నదని సెస్సు ఒక అధ్యయనంలో వెల్లడించింది. ఇది భూస్వామ్య వ్యవస్థను పరిరక్షించడమే. ప్రపంచంతో పోటీ పడాలంటే దక్షిణ కొరియాలో మాదిరిగా భూ గరిష్ఠ పరిమితిని ఏడున్నర ఎకరాలుగా నిర్ణయించాలి. చైనా వలె 17 రోజుల్లో భూ పంపిణీ చట్టాలను అమలుచేయండి. మన దేశంలో పంచిన మొత్తం భూమిలో ఒక్క పశ్చిమబెంగాల్‌లోనే 20 శాతం పంచా రు. మన రాష్ట్రంలో వామపక్ష సిద్ధాంతాలకు కాలం చెల్లకుండా ఉండాలంటే భూ పంపిణీపై పోరాటం చేయాలి. అదే చాకలి ఐలమ్మకు అసలైన నివాళి. భూ పంపిణీ చేసి సామాజిక తెలంగాణ తేవాలి. అప్పుడే ఐలమ్మ ఆశయం నెరవేరుతుంది.

# పర్సనల్ ట్రైనర్‌గా చాట్‌జీపీటీ

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వాడకం రోజువారీ జీవితంలో వేగంగా విస్తరిస్తోంది. ప్రయాణాల ప్లానింగ్ నుంచి ఆఫీస్ పనుల వరకు సాయం చేస్తున్న ఏఐ, ఇప్పుడు బరువు తగ్గడం లాంటి వ్యక్తిగత లక్ష్యాల సాధనలోనూ కీలక పాత్ర పోషిస్తోంది. దీనికి నిదర్శనమే హసన్ అనే 'ఎక్స్' (ట్విట్టర్) యూజర్ కథ. అతను చాట్‌జీపీటీ సహాయంతో ఏకంగా 27 కిలోల బరువు తగ్గి అందరి దృష్టినీ ఆకర్షించాడు.హసన్ జిమ్‌కు వెళ్లలేదు, ఖరీదైన డైట్ ప్లాన్‌లు పాటించలేదు. బదులుగా, చాట్‌జీపీటీని తన పర్సనల్ ట్రైనర్‌గా, గైడ్‌గా వాడుకున్నాడు. రోజూ క్రమం తప్పకుండా సరైన ప్రాంప్ట్‌లు (ప్రశ్నలు/ఆదేశాలు) ఇస్తూ ఒక పద్ధతి ప్రకారం ముందుకు సాగాడు. "చాట్‌జీపీటీని నా పర్సనల్ ట్రైనర్‌గా భావించి 27 కిలోలు తగ్గాను. రోజూవారీ క్రమశిక్షణ, సరైన ప్రాంప్ట్‌లు నాకు ఒక పద్ధతిని నేర్పాయి" అని హసన్ తన పోస్ట్‌లో పేర్కొన్నాడు.బరువు తగ్గాలనుకునే ఇతరులకు స్ఫూర్తినిస్తూ, తాను ఉపయోగించిన 7 కీలకమైన ప్రాంప్ట్‌లను కూడా అతను షేర్ చేశాడు. వీటిలో శరీర విశ్లేషణ, లక్ష్య నిర్ధారణ, బడ్జెట్‌లో దొరికే పదార్థాలతో మీల్ ప్లాన్, ఇంట్లోనే పరికరాలు లేకుండా చేసుకునే వర్కవుట్లు, తీపి తినాలనే కోరికను నియంత్రించే చిట్కాలు, అలవాట్లను ట్రాక్ చేసే సిస్టమ్, మానసిక స్థైర్యం కోసం సూచనలు, వారానికోసారి పురోగతిని సమీక్షించుకోవడం వంటివి ఉన్నాయి.సరైన మార్గదర్శకత్వం, క్రమశిక్షణతో పాటు ఏఐని తెలివిగా ఉపయోగించుకుంటే జిమ్ లేదా కఠినమైన డైటింగ్ లేకుండానే బరువు తగ్గడం లాంటి లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చని హసన్ అనుభవం తెలియజేస్తోంది.

# నాణేల అంచులపై ఆ గీతలెందుకు?

**దాని వెనుక ఓ పెద్ద కథే ఉంది!**

**వందల ఏళ్ల క్రితమే ప్రారంభమైన నాణేల అంచులపై గీతలు**

**విలువైన లోహాల దొంగతనాన్ని అరికట్టడమే దీని అసలు ఉద్దేశం**

**ఈ పద్ధతిని ప్రాచుర్యంలోకి తెచ్చిన శాస్త్రవేత్త సర్ ఐజాక్ న్యూటన్**

**నకిలీ నాణేల నివారణ, అంధులకు ఉపయోగపడటం దీని ఆధునిక ప్రయోజనాలు**

**ప్రస్తుతం దేశం, విలువను బట్టి ఈ అంచుల డిజైన్లు మార్పు**



మనం రోజూ వాడే నాణేల అంచులపై గీతలు లేదా గాట్లు ఉండటాన్ని చాలామంది గమనించే ఉంటారు. అవి కేవలం అలంకారం కోసం పెట్టినవి కావని, వాటి వెనుక శతాబ్దాల చరిత్ర, బలమైన కారణాలు ఉన్నాయని తెలిస్తే ఆశ్చర్యపోతారు. ఒకప్పుడు ఆర్థిక వ్యవస్థలను కుదిపేసిన ఓ భారీ మోసాన్ని అరికట్టేందుకు ఈ గీతలు పుట్టుకొచ్చాయి.

### చారిత్రక అవసరం.. న్యూటన్ ఆలోచన

17వ శతాబ్దంలో యూరప్‌లో నాణేలను బంగారం, వెండి వంటి విలువైన లోహాలతో తయారు చేసేవారు. ఆ సమయంలో 'కాయిన్ క్లిప్పింగ్' అనే మోసం పెరిగిపోయింది. కొందరు వ్యక్తులు నాణేల అంచులను చాకచక్యంగా గీకి, ఆ లోహాన్ని కొద్దికొద్దిగా దొంగిలించి, బరువు తగ్గిన నాణేలను తిరిగి చెలామణిలో పెట్టేవారు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థలకు పెను సవాలుగా మారింది.ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు ఇంగ్లండ్‌లో 1696-1699 మధ్య జరిగిన 'గ్రేట్ రీకాయినేజ్' (నాణేల పునరుద్ధరణ) సమయంలో రాయల్ మింట్ వార్డెన్‌గా ఉన్న ప్రఖ్యాత శాస్త్రవేత్త సర్ ఐజాక్ న్యూటన్ రంగంలోకి దిగారు. ఆయన యంత్రాల ద్వారా నాణేలను ముద్రించి, వాటి అంచులకు ఒకే రీతిలో ఉండేలా గీతలను (రీడెడ్ ఎడ్జెస్) ఏర్పాటు చేయించారు. దీనివల్ల ఎవరైనా నాణెం అంచును గీకితే ఆ గీతల నమూనా దెబ్బతిని, మోసం వెంటనే బయటపడిపోయేది. ఈ ఆవిష్కరణతో ప్రజలకు కరెన్సీపై మళ్లీ నమ్మకం కలిగింది.

### ఆధునిక కాలంలో ప్రయోజనాలు

ప్రస్తుతం నాణేలను విలువైన లోహాలతో తయారు చేయడం లేదు కాబట్టి, 'క్లిప్పింగ్' మోసానికి ఆస్కారం లేదు. అయినప్పటికీ, ఈ గీతల పద్ధతిని ఇంకా కొనసాగించడానికి కొన్ని ముఖ్యమైన కారణాలు ఉన్నాయి.

1. నకిలీల నివారణ: అంచులపై సంక్లిష్టమైన గీతలను రూపొందించడం ద్వారా నకిలీ నాణేలను తయారు చేయడాన్ని కష్టతరం చేయవచ్చు. ఇది కరెన్సీ భద్రతలో ఒక ముఖ్యమైన అంశం.
2. పట్టు కోసం: నునుపైన అంచుల కన్నా గీతలున్న అంచులు చేతిలో పట్టుకోవడానికి సులువుగా ఉంటాయి. దీనివల్ల నాణేలు జారిపోయే అవకాశం తగ్గుతుంది.
3. అంధులకు వరం: ఆధునిక కాలంలో ఈ గీతల వల్ల అత్యంత ముఖ్యమైన ప్రయోజనం ఇది. దృష్టి లోపం ఉన్నవారు నాణేలను కేవలం స్పర్శ ద్వారా గుర్తించేందుకు ఈ గీతలు ఎంతగానో సహాయపడతాయి. ఉదాహరణకు, అమెరికాలో ఎక్కువ విలువైన క్వార్టర్, డైమ్ నాణేలకు గీతలు ఉంటాయి. తక్కువ విలువైన పెన్నీ, నికెల్ నాణేలకు నునుపైన అంచులు ఉంటాయి. ఇలాంటి పద్ధతి ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల కరెన్సీలలో ఉంది.నాణేల విలువ, దేశాన్ని బట్టి ఈ అంచుల డిజైన్లు మారుతూ ఉంటాయి. కొన్నింటిపై నిరంతరాయంగా గీతలుంటే, మరికొన్నింటిపై అక్షరాలు లేదా ఇతర గుర్తులు ఉంటాయి. ఈ డిజైన్లను నాణేల ముద్రణ సమయంలోనే అత్యంత కచ్చితత్వంతో ప్రత్యేక యంత్రాల ద్వారా ఏర్పాటు చేస్తారు.

# బతుకమ్మ లేని తల్లిని ఊహించలేం



'ఉద్యమకారులు, కవులు, కళాకారులు, మేధావుల ఏకాభిప్రాయంతో 'తెలంగాణ తల్లి' ఇలా ఉండాలని నిర్ణయించి నాడే ఆ తల్లిని హుందాగా రూపొందించారు. నేడు ఆ ఆకృతిని బోసిపోయినట్టుగా మార్చడం రాష్ట్రానికే సిగ్గుచేటు. కేసీఆర్ ఆనవాళ్లను లేకుండా చేస్తానని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఆ దిశగానే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్టుంది' అని తెలంగాణ ఉద్యమకారుడు, నాగర్‌కర్నూల్‌కు చెందిన కవి వనపట్ల సుబ్బయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన 'నమస్తే తెలంగాణ'తో ముచ్చటించారు.వనపట్ల సుబ్బయ్య: బతుకమ్మ లేని తెలంగాణ తల్లిని ఓ అభిమానిగా, ఓ కవిగా ఊహించుకోలేకపోతున్నా. ఓ రాజకీయ పార్టీనో లేక ఓ రాజకీయ నాయకుడో పెట్టింది కాదు బతుకమ్మ. తెలంగాణ లో అనాది నుంచి వారసత్వంగా వస్తున్న సంప్ర దాయం. 50 ఏండ్ల పాటు తెలుగు తల్లిగా ఉన్నటువంటి తెలంగాణలో మనకంటూ ఒక 'తెలంగాణ తల్లి' ఉండాలనే ఆలోచన చేసిన మొట్ట మొదటి వ్యక్తి కేసీఆర్. అలాంటి తెలంగాణ తల్లి విగ్రహంలో నాటి ఉద్యమకారులు బతుకమ్మకు ప్రముఖ స్థానం కల్పించారు. అలాంటి బతుకమ్మను నేటి తెలంగాణ తల్లి నుంచి వేరు చేయడం సిగ్గుచేటు.తన చేతిలో బతుకమ్మ పెట్టుకొని ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం తొలిసారిగా 2006లో కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో ఆవిష్కరింపబడింది. ఆ త ర్వాత తెలంగాణ తల్లి మనకు ఆరాధ్య దైవమైంది. ఏ తల్లయినా బట్టలు చినిగిపోయి ఉండాలని కోరుకోదు. అందుకే నాటినుంచి ఆభరణాలు, కిరీటం చేయించి అమ్మగా కొలుచుకుంటున్నాం.తెలంగాణ తల్లి విగ్రహాన్ని మీరు అధికారంలో ఉండి పెట్టలేకపోయారు. అందుకే, ఇప్పుడు మేము పెడుతున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలకు పోతున్నది. కానీ అది వాస్తవానికి విరుద్ధం. 2006లోనే రాష్ట్ర వ్యాప్తంగా వేలకొద్దీ తెలంగాణ తల్లి విగ్రహాలు కొలువుదీరాయి. అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాటుచేసిన విగ్రహం కావచ్చు, ప్రపంచ తెలుగు మహాసభలలో ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా పూజలందుకున్న తెలంగాణ తల్లి కావచ్చు.. ఇవన్నీ గతంలో ఏర్పాటుచేసినవే. రాష్ట్రంలో మూలమూలన తెలంగాణ తల్లి విగ్రహాలున్నప్పటికీ మళ్లీ పెట్టాలనే ప్రభుత్వ ఆలోచన వెనుక కేసీఆర్ ఆనవాళ్లను చెరిపివేయాలనే కుట్రలు కనపడుతున్నాయి.నూటికి నూరు శాతం నా అభిప్రాయం అదే. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయం ఎదురుగా ప్రతిష్ఠించుకుందామనుకొని, అందుకోసం స్థలాన్ని కూడా సేకరించుకొని పెట్టుకున్నది. ఆలోపు అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఆ పనికి ఆగిపోయింది. ఆ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ కి అవకాశం ఇచ్చారు. ఆ అవకాశాన్ని కాంగ్రెస్ నాయకులు సద్వినియోగం చేసుకోకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. అందుకు ఉదాహరణే సచివాలయం ముందు రాజీవ్‌గాంధీ విగ్రహ ప్రతిష్ఠాపన. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించాల్సిన చోట, అసలు తెలంగాణకు, తెలంగాణ ఉద్యమానికి ఏ మాత్రం సంబంధంలేని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠించడం తెలంగాణ అస్తిత్వాన్ని అణగదొక్కాలని చూడటమే. దానితోనే ఆగకుండా తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని కూడా మార్చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. తెలంగాణ తల్లి, బతుకమ్మలను వేరు చేయడం ఇంకా విచారకరమైన విషయం. సచివాలయంలో పెట్టిన తెలంగాణ తల్లి విగ్రహం చేతిలో అభయహస్తం ఉంది, అది చేయిగుర్తును పోలినట్టుగా ఉన్నది. ఆ చేతిలో బతుకమ్మ ఉంటే మాకు, తెలంగాణ ప్రజలకు గౌరవంగా ఉంటుంది. బతుకమ్మ లేని తెలంగాణ తల్లిని ఒక కవిగా నేను ఊహించుకోలేకపోతున్నా.వంద శాతం అనిపిస్తున్నది. తెలంగాణ ఉద్యమ సమయంలో రెండు కండ్ల సిద్ధాంతాన్ని ప్రదర్శించిన చంద్రబాబు ప్రస్తుతం ఆంధ్రప్రదే శ్‌కు సీఎంగా ఉన్నాడు. ఆయన శిష్యుడు రేవంత్‌రెడ్డి ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి గా ఉన్నారు. గత పదేండ్లలో కేసీఆర్ చేసిన అభివృద్ధి ఆనవాళ్లను ఈ ఇద్దరు కలిసి తుడిచేయాలనే కుట్రలు చేస్తున్నట్టు ప్రస్ఫుటంగా అర్థమవుతున్నది. ఆ కుట్రలో భాగమే ఉద్యమ సమయంలో తయారు చేసుకున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం మార్చివేసి అబాసుపాలవుతు న్నది.సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టడమనేది హర్షించదగిన విషయం ఎంతమాత్రమూ కాదు. ఎందుకంటే రాష్ట్రంలోని నలుమూలల నుంచి ప్రజలు నగరానికి వస్తుంటారు, పోతుంటారు. ఆ తల్లి విగ్రహాన్ని చూడాలనుకున్నప్పుడు సచివాలయ పోలీసు సిబ్బంది వారిని లోపలికి అనుమతించే ఆస్కారం ఉండదు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడాలనే కోరిక నాదే కాదు, నాలుగుకోట్ల తెలంగాణ ప్రజలది కూడా. అరువై ఏండ్లు పోరాడినా తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించకపోవడంతో, ఇక తెలంగాణ రాష్ట్రం రాదేమోనని, మేము ఆత్మబలిదానాలు చేసుకుంటేనైనా తెలంగాణ ప్రకటిస్తారేమోనన్న ఆశతో కొంతమంది యువకులు ఆత్మహత్య చేసుకున్నారు, అగ్నికి ఆహుతయ్యారు. వారి ఆశయాలకనుగుణంగా ఇవ్వాళ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. అలాంటి తెలంగాణ రాష్ట్రంలో బంగారు బాటగా దూసుకెళ్తున్న క్రమంలో పరాయి శక్తులు మళ్లీ తెలంగాణపై పడ్డాయి. అందులో భాగంగానే తెలంగాణ తల్లి విగ్రహ రూపంలో మార్పు, ఆ తల్లి నుంచి బతుకమ్మను దూరం చేయడమే. ఇది తెలంగాణకు క్షేమదాయకం కాదు.ప్రభుత్వం ఇకనైనా పునరాలోచించుకొని తెలంగాణ తల్లి విగ్రహ మార్పులో వెనక్కి తగ్గాలి. లేకుంటే ప్రజలు సహించరు.

# సెబీ సర్క్యూలర్ తో ఒక్క రోజే 8 శాతం పెరిగిన ఏంజెల్ వన్ షేర్లు




మార్కెట్ నియంత్రణ సంస్థ అయిన సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) కొత్తగా అమలు చేసిన క్లోజింగ్ ఆక్షన్ సెషన్ పై జారీ చేసిన సర్క్యులర్ జారీ చేసింది. దీంతో శుక్రవారం నాటి ఇంట్రాడే ట్రేడింగ్‌లో బ్రోకరేజ్ కంపెనీల షేర్లతో పాటు బీఎస్ఈ షేర్లను కూడా పెరిగాయి. ఎన్ఎస్ఈలో సెషన్‌లో ఏంజెల్ వన్ షేర్లు దాదాపు 8 శాతం పెరగ్గా.. ఆ తర్వాత బీఎస్ఈ షేర్లు 5 శాతం పెరిగాయి. బిలియన్‌బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్ (గ్రోవ్) షేరు ధర దాదాపు 3 శాతం పెరిగింది. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లు కూడా దాదాపు 3 శాతం లాభపడగా, నువమా వెల్త్ మేనేజ్‌మెంట్ షేర్లు 1% పైగా పెరిగాయి. సెప్టెంబర్ 3న, డెరివేటివ్ కాంట్రాక్టుల సెటిల్మెంట్ ధరలను నిర్ణయించడానికి అమలు చేసిన జూరా పద్ధతిలో మార్పులను ప్రతిపాదిస్తూ ఒక సంప్రదింపు పత్రాన్ని జారీ చేస్తామని మార్కెట్ నియంత్రణ సంస్థ తెలిపింది. సెబీ సెక్యూరిటీల ముగింపు ధరను నిర్ణయించడానికి ఆగస్టు 3 నుంచి ఈక్విటీ క్యాష్ విభాగంలో క్లోజింగ్ ఆక్షన్ సెషన్ ను ప్రవేశపెట్టింది. దీని అమలు జరిగినప్పటి నుంచి అమలును సులభతరం చేయడానికి ఇతర సమస్యలను పరిష్కరించడానికి సెబీ స్టాక్ ఎక్స్ఛేంజీలు, బ్రోకర్లు, సాఫ్ట్‌వేర్ విక్రేతలు, మ్యూచువల్ ఫండ్‌లు, పరిశ్రమ సంఘాలు, తో సహా వివిధ భాగస్వాములతో పనిచేసింది. తులం బంగారం అంటే ఎంత.. 10 గ్రాములా.. 11.66 గ్రాములా.. పూర్తి క్లారిటీ ఇదే.. భాగస్వాములు లేవనెత్తిన ముఖ్యమైన సమస్యలలో ఒకటి, ద్వారా నిర్ణయించిన ముగింపు ధర ఆధారంగా గడువు ముగిసే రోజున డెరివేటివ్ కాంట్రాక్టుల సెటిల్‌మెంట్ ధరలను నిర్ణయించడానికి సంబంధించినదని నొక్కి చెప్పింది. జూరా ఫ్రేమ్‌వర్క్ కింద ఒక ట్రేడింగ్ రోజు చివరి పదిహేను నిమిషాలలో గరిష్ట సంఖ్యలో కొనుగోలు, అమ్మకం ఆర్డర్‌లను సరిపోల్చడం ద్వారా ముగింపు ధర నిర్ణయించనున్నారు. వేలం సెషన్ ద్వారా వచ్చిన ముగింపు ధర కూడా గడువు ముగిసే రోజున డెరివేటివ్ కాంట్రాక్టుల సెటిల్‌మెంట్ ధరలను నిర్ణయించడానికి ఆధారంగా ఉపయోగించనున్నారు. జూరా ఫ్రేమ్‌వర్క్ కారణంగా ఏర్పడుతున్న అనూహ్యమైన ధరల హెచ్చుతగ్గులు, మార్కెట్ అనిశ్చితిని మార్కెట్ భాగస్వాములు ప్రముఖంగా ప్రస్తావిస్తున్నారు. ఉదాహరణకు, దీూజు ఎక్స్‌పైరీ రోజు అయిన గురువారం, వేలం సెషన్ ప్రారంభమైన మొదటి ఐదు నిమిషాల్లోనే సెన్సెక్స్ సుమారు 2,100 పాయింట్లు పతనమై, ఆ తర్వాత వెంటనే కోలుకుంది. సూచీ చివరికి 417 పాయింట్లు తగ్గి 76,152.86 వద్ద ముగిసింది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. రాణించిన రియల్టీ, ఇంధన రంగాల షేర్లు





ప్రపంచ మార్కెట్లలోని సానుకూల సంకేతాల నేపథ్యంలో రియల్టీ, ఇంధన రంగాల షేర్లలో కొనుగోళ్ల జోరుతో శుక్రవారం భారత స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. సెన్సెక్స్ ం362 పాయింట్లు పెరిగి 76,515 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 24 పాయింట్లు పెరిగి 23,897 వద్ద స్థిరపడింది. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.4 శాతం లాభపడగా, నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ స్వల్పంగా పెరిగింది. వివిధ రంగాల విషయానికొస్తే, నిఫ్టీ ఐటీ, నిఫ్టీ రియల్టీ, నిఫ్టీ మీడియా, నిఫ్టీ ఆయిల్ గ్యాస్ రంగాలు లాభాలతో ట్రేడవగా, నిఫ్టీ ఆటో, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ రంగాల్లో నష్టాలు ముగిశాయి. క్లోజింగ్ ఆక్షన్ సెషన్ ప్రవేశపెట్టిన తర్వాత, డెరివేటివ్ కాంట్రాక్టుల సెటిల్‌మెంట్ ధరలను ఎలా నిర్ణయిస్తున్నారో సమీక్షిస్తామని సెబీ ప్రకటించడంతో మార్కెట్‌కు ఊరట లభించింది. బీఎస్ఈ ఇండెక్స్ లో టాటా స్టీల్, రిలయన్స్, బజాజ్ ఫైనాన్స్, ట్రెంట్, అదానీ పోర్ట్స్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, కోటక్ మహీంద్ర బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, టైటాన్, ఎంఅండ్ఎం, హిందుస్థాన్ యూనిలివర్, ఎన్టీపీసీ, ఐటీసీ, బజాజ్ ఫిన్ సర్వ్, ఇండిగో, యాక్సిస్ బ్యాంక్, పవర్ గ్రిడ్, ఇన్ఫోసిస్, ఎల్అండ్ టీ, ఎస్బీఐఎన్ లాభాల్లో ముగిశాయి. మారుతి, బీఈఎల్, ఐసీఐసీఐ బ్యాంక్, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా, టీసీఎస్, ఏసియన్ పెయింట్స్, ఎటర్నల్, హెచ్ సీఎల్ టెక్, భారతి ఎయిర్ టెల్ నష్టాల్లో ముగిశాయి.మూడేళ్లలో రూ.లక్షను రూ.4 లక్షలు చేసిన మల్టీ బ్యాగర్ స్టాక్ ఇదే.. కొత్తగా అమలు చేసిన క్లోజింగ్ ఆక్షన్ సెషన్ పై మార్కెట్ నియంత్రణ సంస్థ అయిన సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా జారీ చేసిన సర్క్యులర్ తో చీూజులో ఈ సెషన్‌లో ఏంజెల్ వన్ షేర్లు దాదాపు 8% పెరగగా, ఆ తర్వాత దీూజు షేర్లు 5% పెరిగాయి. బిలియన్‌బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్ షేరు ధర దాదాపు 3% పెరిగింది. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లు కూడా దాదాపు 3% లాభపడగా, నువమా వెల్త్ మేనేజ్‌మెంట్ షేర్లు 1% పైగా పెరిగాయి. రాబోయే ద్రవ్యోల్బణ గణాంకాలు మితంగా ఉంటే మరో వడ్డీ రేటు పెంపు అవసరం కాకపోవచ్చని ఫెడరల్ రిజర్వ్ గవర్నర్ క్రిస్టోఫర్ వాలర్ సూచించిన తర్వాత యూఎస్ ట్రెజరీ రాబడులు పడిపోయాయి. ఫెడరల్ రిజర్వ్ విధాన మార్గంపై అంచనాలను రూపొందిస్తుందని భావిస్తున్న శుక్రవారం నాటి యూఎస్ నాన్‌ఫార్మ్ పేరోల్స్ నివేదిక కోసం ఇప్పుడు పెట్టుబడిదారులు ఎదురుచూస్తున్నారు. డిస్క్లైమర్ ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# దసరా లేదా దీపావళికి జియో ఐపీఓ.. సిద్ధంగా ఉన్నారా..




అతి పెద్ద ఏపీఓకు రాకకు రంగం సిద్ధమవుతోంది. ఈ ఐపీఓకు సంబంధించి కొద్ది నెలలుగా వార్తలు వస్తూనే ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం రిలయన్స్ ఇండస్ట్రీస్ ఐపీఓ కోసం సెబీకి డీఆర్హెచ్పీ సమర్పించింది. దీనికి ప్రతిగా ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ కోసం సెబీ అనుమతి ఇచ్చింది. దీంతో జియో ఐపీఓ ఎప్పుడు వస్తుందా అని ఇన్వెస్టర్లు ఎదురు చూస్తున్నారు. నేషనల్ మీడియా కథనాల ప్రకారం వచ్చే దసరా లేదా దీపావళికి జియో ఐపీఓ వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. అక్టోబర్, నవంబర్ నెలల మధ్య పండుగ సీజన్‌లో ఐపీఓ వచ్చే అవకాశం ఉందని నివేదికలు పేర్కొంటున్నాయి. అంటే, నవరాత్రి, దీపావళి పండుగల సందర్భంగా ముఖేష్ అంబానీ ఈ ఐపీఓను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారని ఎకనామిక్ టైమ్స్ తెలిపింది. ఈ ఐపీఓలో భాగంగా 4 బిలియన్ డాలర్లు అంటే రూ. 37,700 కోట్లకు పైగా నిధుల సమీకరించనున్నారు. ఇంతే స్థాయిలో ఐపీఓకు వస్తే దేశంలోనే అతిపెద్ద ఐపీఓగా జియో నిలువనుంది. 2024లో హ్యుందాయ్ మోటార్ ఇండియా జరిపిన 3.3 బిలియన్ డాలర్ల ఐపీఓ వచ్చింది. జియో ఐపీఓ ఎన్ఎస్ఈ ప్రతిపాదించిన రూ. 30,000 కోట్ల ఫ్లోట్‌ను కూడా మించిపోయే అవకాశం ఉంది. జియో ఎలాంటి ఆఫర్-ఫర్-సేల్ అంశం లేకుండా కేవలం ప్రైమరీ ఇష్యూ ద్వారానే షేర్లను జారీ చేయాలని భావిస్తోంది. ఈ కంపెనీ ఒక్కో షేరు ముఖ విలువ రూ. 10 చొప్పున 27 కోట్ల షేర్లను జారీ చేయనున్నారు. దీనివల్ల 2.9% ఈక్విటీ డైల్యూషన్ కానుంది. ఇప్పటికే ఉన్న వాటాదారులెవరూ తమ షేర్లను విక్రయించడం లేదు కాబట్టి, వచ్చిన మొత్తం ఆదాయం కంపెనీకే చెందనుంది. రూ.10 లకే ఐస్ క్రీమ్.. ముఖేశ్ అంబానీ ప్లాన్ ఇదే.. సెబీ కొత్త లిస్టింగ్ నిబంధనల ప్రకారం ప్రమోటర్ వాటాను తగ్గించుకోవాల్సి ఉంటుంది. జియో లిస్టింగ్ తర్వాత రూ. 5 లక్షల కోట్లకు పైగా విలువ ఉన్న కంపెనీగా నిలువనుంది. రిలయన్స్ ఇండస్ట్రీ నుంచి ఇప్పటికే జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిస్ట్ అయింది. అయితే డిమెర్జర్ ద్వారా జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ స్టాక్ మార్కెట్ లో లిస్ట్ అయ్యాయి. అయితే జియోను మాత్రం ఐపీఓగా తీసుకొస్తున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ 2023లో జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌ను వేరు చేసి లిస్ట్ చేశారు. మార్చి 31, 2026 నాటికి జియో ప్లాట్‌ఫారమ్స్ రూ. 27,579 కోట్ల నికర రుణాన్ని కలిగి ఉంది. అయితే దేశంలోనే అతిపెద్ద టెలికామ్ సంస్థగా ఉంది. జియో ప్లాట్‌ఫారమ్స్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ కు 66.43% వాటా ఉంది. మిగిలిన 33.57% వాటా ప్రపంచ స్థాయి పెట్టుబడిదారుల చేతిలో ఉంది. వీరిలో మెటా ప్లాట్‌ఫారమ్స్ (9.98%), గూగుల్ ఇంటర్నేషనల్ (7.73%), సౌదీ అరేబియాకు చెందిన పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (2.31%), కెకెఆర్ 2.31%), విస్టా ఈక్విటీ పార్ట్‌నర్స్ (2.31%) వంటి సంస్థలు ఉన్నాయి. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# వరంగల్, కరీంనగర్ వాసులకు గుడ్ న్యూస్.. అక్టోబర్ లో గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రారంభం



వరంగల్, కరీంనగర్ వాసులకు శుభవార్త. గ్రీన్ ఫీల్డ్ హైవేగా నిర్మిస్తున్న వరంగల్-జగిత్యాల జాతీయ రహదారిలోని హన్మకొండ-కరీంనగర్ రహదారి పనులు దాదాపు పూర్తి అయినట్లు అధికారులు చెబుతున్నారు. 68 కిలోమీటర్ల మేర ఉన్న ఈ హైవేపై ఈ నెల 5 నుంచి ట్రయల్ రన్ నిర్వహించేందుకు నేషనల్ హైవే అథారిటీ అధికారులు సిద్ధమయ్యారు. పూర్తి స్థాయిలో ట్రాఫిక్ ను హైవేపైకి మళ్లించడం ద్వారా ఎదురయ్యే ఇబ్బందులు తెలుసుకోనున్నారు. నిఘా కోసం ఒక కిలోమీటర్‌కు రెండు అత్యాధునిక కెమెరాలను ఏర్పాటు చేశారు. హైవేపై 24 గంటలపాటు రియల్ టైం మానిటరింగ్ చేయనున్నారు. శంకరపట్నం మండలం కొత్తగట్టులో టోల్ ప్లాజాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ గ్రీన్ ఫీల్డ్ హైవేను జగిత్యాల నుంచి ఖమ్మం వరకు నిర్మిస్తున్నారు. నేషనల్ హైవేను వరంగల్-జగిత్యాల మధ్య రెండు ప్యాకేజీలుగా విభజించి పనులు చేపట్టారు. వరంగల్-కరీంనగర్ ప్యాకేజీ పనులు రూ.2486 కోట్లతో చేపట్టగా కేంద్ర మంత్రి బండి సంజయ్ నిరంతర పర్యవేక్షణతో మూడేండ్లలోపే పనులు పూర్తి అయ్యాయి. హన్మకొండ నుంచి కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ వరకు రోడ్డు పూర్తయినా.. ప్రస్తుతానికి మానకొండూరు సమీపంలోని ఖాదర్‌గూడెం వరకు మాత్రమే రాకపోకలకు అనుమతి ఇచ్చే అవకాశం ఉంది. మానకొండూరు-దుర్శేడు మధ్య పెండింగ్ లో ఉన్న పనులు కూడా యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు ప్రకటించారు. తులం బంగారం అంటే ఎంత.. 10 గ్రాములా.. 11.66 గ్రాములా.. పూర్తి క్లారిటీ ఇదే.. పనులన్నీ పూర్తయ్యాక త్వరలోనే ప్రధాని మోదీ చేతుల మీదుగా గ్రీన్ ఫీల్డ్ హైవేను ప్రారంభించనున్నారు. ఈ హైవే నిర్మాణంతో కరీంనగర్-వరంగల్ నగరాల మధ్య ఐదు కిలోమీటర్ల దూరం తగ్గనుంది. గతంలో రెండు నగరాల మధ్య దూరం 72 కి.మీ. ఉండగా.. ఇప్పుడు 68 కి.మీ.కు తగ్గింది. గంటకు 100 కి.మీ.ల గరిష్ట వేగంతో వెళ్లేందుకు ఈ హైవేను వీలుగా నిర్మించడం వల్ల కారులో అయితే కేవలం 45 నిమిషాల నుంచి గంటలోపే కరీంనగర్ నుంచి వరంగల్ చేరుకునే అవకాశం ఉంది. రహదారిపై నీరు నిలవకుండా ఉండేందుకు ఎక్కడి నీరు అక్కడే భూగర్భంలోకి ఇంకేలా రహదారి వెంట భారీ ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వరదంతా పొలాలను ముంచెత్తకుండా, రోడ్డు కోతకు గురికాకుండా రాష్ట్రంలోనే తొలిసారిగా ఇలాంటి గుంతలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. రాత్రి పూట అవతలి వైపు ఎదురుగా వచ్చే వాహనాల లైటింగ్ ఇవతలి వాహనాల మీద పడకుండా రోడ్డు మధ్యలో మీడియన్ చేస్తున్నట్లు వివరించారు. అక్టోబరు 1 నుంచి ఈ మార్గంలో ప్రయాణించే వాహనాలకు టోల్ ఛార్జీలు వసూలు చేసేందుకు కూడా ఏర్పాట్లు చేశారు. అయితే జగిత్యాల, కరీంనగర్ మధ్య ఇంకా పనులు ప్రారంభం కాలేదని తెలుస్తోంది. కరీంనగర్ జగిత్యాల రోడ్డు చిన్నదిగా ఉండడం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. డిస్క్లైమర్ ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు సిరాజ్, పడిక్కల్.. సౌత్ జోన్ జట్టులో చోటు

**సెప్టెంబర్ 6న ఈస్ట్‌తో ఫైనల్ శ్రీలంకపై పడిక్కల్ 328 పరుగులు రెండు సెంచరీలతో**

**ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ శ్రీలంక సిరీస్‌లో సిరాజ్ 4 వికెట్లు తిలక్ వర్మ ఫైనల్ ఆడేందుకు ఆసక్తి**




దులీప్ ట్రోఫీ ఫైనల్ పోరుకు భారత స్టార్ క్రికెటర్లు మహ్మద్ సిరాజ్, దేవదత్ పడిక్కల్ సిద్ధమయ్యారు. సెప్టెంబర్ 6 నుంచి ఈస్ట్ జోన్‌తో జరగనున్న ఫైనల్ కోసం సౌత్ జోన్ జట్టులో వీరిద్దరికీ చోటు దక్కింది. ఇటీవల శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లోనూ ఇద్దరూ భారత్ తరపున ఆడారు. ఈ సిరీస్‌ను భారత్ 1-0తో గెలుచుకుంది.శ్రీలంక సిరీస్‌లో పడిక్కల్ అద్భుతంగా రాణించాడు. మూడు ఇన్నింగ్స్‌ల్లో 328 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. మరోవైపు సిరాజ్ రెండు టెస్టుల్లో నాలుగు వికెట్లు పడగొట్టాడు. అయితే దులీప్ ట్రోఫీ ఫైనల్ కోసం వీరిద్దరూ సౌత్ జోన్ జట్టులో ఎవరిని భర్తీ చేస్తారన్నది ఇంకా స్పష్టంగా తెలియలేదు.టీ20 జట్టులో రెగ్యులర్‌గా ఉంటున్న వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ కూడా ఫైనల్‌లో ఆడే అవకాశం ఉందని సమాచారం. సెప్టెంబర్ 10న దులీప్ ట్రోఫీ ఫైనల్ ముగియనుండగా.. సెప్టెంబర్ 13 నుంచి ఆఫ్ఘనిస్థాన్‌తో టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. అయినా ఫైనల్‌లో ఆడేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తిలక్ ఇప్పటికే చెప్పాడు. నార్త్ జోన్‌తో సెమీఫైనల్లో తిలక్ తొలి ఇన్నింగ్స్‌లో 116 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 51 పరుగులతో ఆకట్టుకున్నాడు. సౌత్ జోన్ సెమీఫైనల్లో నార్త్‌ను 181 పరుగుల ఛేదనలో ఓడించింది.మరోవైపు ఈస్ట్ జోన్ 159 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి డిఫెండింగ్ ఛాంపియన్ సెంట్రల్ జోన్‌ను ఫైనల్ రేసు నుంచి తప్పించింది. ఇషాన్, సూర్యవంశీ ఆడకపోతే ఈస్ట్ జోన్ కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేయాల్సి ఉంటుంది. బెంగాల్‌కు చాలాకాలంగా కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న అభిమన్యు ఈశ్వరన్‌కు ఆ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది.

# టీ20 క్రికెట్‌లో తెలుగు తేజం శ్రీ చరణి అరుదైన ఫీట్

**మహిళల ఆసియా కప్ 2026లో హాంకాంగ్‌పై భారత్ ఘన విజయం**

**137 పరుగుల భారీ తేడాతో గెలిచిన భారత మహిళల జట్టు**

**బౌలింగ్‌లో రెండు వికెట్లతో సత్తాచాటిన శ్రీ చరణి**

**ఒకే క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక టీ20 వికెట్లు తీసిన రెండో భారత బౌలర్‌గా రికార్డ్**

**2024లో దీప్తి శర్మ నెలకొల్పిన రికార్డును అధిగమించిన చరణి**




దుబాయ్ వేదికగా జరుగుతున్న మహిళల ఆసియా కప్ 2026లో భారత జట్టు తన జోరును కొనసా గిస్తోం ది. దుబా య్ అంతర్జాతీ య క్రికెట్ స్టేడియంలో హాంకాం గ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 137 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత క్రీడాకారిణులు అన్ని విభాగాల్లోనూ అద్భుత ప్రదర్శన కనబరిచారు. ముఖ్యంగా యువ బౌలర్, తెలుగు తేజం శ్రీ చరణి తన అద్భుతమైన బౌలింగ్‌తో ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది.ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు నిర్ణీత ఓవర్లలో 193 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. అనంతరం 194 పరుగుల లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన హాంకాంగ్ జట్టు భారత బౌలర్ల ధాటికి తట్టుకోలేకపోయింది. ముఖ్యంగా శ్రీ చరణి తన స్పెల్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టింది. తన అద్భుతమైన బౌలింగ్‌తో హాంకాంగ్ పతనాన్ని శాసించడంలో కీలక పాత్ర పోషించింది.ఈ మ్యాచ్‌లో కేవలం 3.2 ఓవర్లు బౌలింగ్ చేసిన శ్రీ చరణి, 16 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు కీలక వికెట్లు పడగొట్టింది. ఈ ప్రదర్శనతో ఆమె ఒకే క్యాలెండర్ ఇయర్‌లో భారత మహిళల జట్టు తరపున అత్యధిక టీ20 వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో రెండో స్థానానికి చేరుకుంది. 2026 క్యాలెండర్ ఇయర్‌లో చరణి ఇప్పటివరకు మొత్తం 31 వికెట్లు పడగొట్టింది. ఈ క్రమంలో 2024లో 30 వికెట్లు తీసిన దీప్తి శర్మ రికార్డును ఆమె అధిగమించింది.ప్రస్తుతం ఈ జాబితాలో స్పిన్నర్ పూనమ్ యాదవ్ అగ్రస్థానంలో ఉంది. ఆమె 2018లో 35 వికెట్లు తీసి ఈ రికార్డును నెలకొల్పింది. చరణి ప్రస్తుత ఫామ్ చూస్తుంటే, ఈ ఏడాది ముగిసేలోపు పూనమ్ యాదవ్ రికార్డును కూడా బద్దలు కొట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

**ఒకే క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక టీ20 వికెట్లు తీసిన భారత బౌలర్లు:**

35 - పూనమ్ యాదవ్ (2018) 31 - శ్రీ చరణి (2026) 30 - దీప్తి శర్మ (2024)
29 - దీప్తి శర్మ (2022) 29 - రాధా యాదవ్ (2024)

# బెన్ స్టోక్స్‌ను బోల్తా కొట్టించిన చాహల్ మ్యాజిక్ బాల్.. వీడియో వైరల్

**కౌంటీ మ్యాచ్‌లో నాలుగు వికెట్లు తీసిన చాహల్**

**బెన్ స్టోక్స్‌ను అద్భుత బంతితో బోల్తా కొట్టించిన వైనం**

**చాహల్ మ్యాజిక్ బాల్ వీడియో వైరల్**

**నార్తాంప్టన్‌షైర్‌కు 20 పరుగుల ఆధిక్యం**

**అర్ష్‌దీప్ అత్యుత్తమ బౌలర్ల జాబితాలో చాహల్‌కు నాలుగో స్థానం**



టీమిండియా స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ మరోసారి తన స్పిన్ మాయ చూపించాడు. కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో బెన్ స్టోక్స్‌ను అద్భుతమైన బంతితో బోల్తా కొట్టించాడు. ఆ బంతి వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.నార్తాంప్టన్‌షైర్ తరపున దర్హమ్‌తో మ్యాచ్‌లో ఆడుతున్న చాహల్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. అలెక్స్ లీస్, బెన్ స్టోక్స్, కేసీ ఆల్డ్రిడ్జ్, మాథ్యూ పాట్స్‌ను పెవిలియన్‌కు పంపించాడు. చాహల్ ధాటికి నార్తాంప్టన్‌షైర్ తొలి ఇన్నింగ్స్‌లో 20 పరుగుల ఆధిక్యం సాధించింది.స్టోక్స్‌ను అవుట్ చేసిన బంతే ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. ఆఫ్ స్టంప్ వెలుపల నుంచి వచ్చిన బంతి ఒక్కసారిగా షార్ప్ టర్న్ తీసుకుంది. స్టోక్స్ అంచనా వేయలేకపోయాడు. బంతి నేరుగా స్టంప్‌లను ఎగరగొట్టింది. చాహల్ వేసిన ఈ అద్భుతమైన డెలివరీని చూసిన అభిమానులు అతడి స్పిన్ మాయపై ప్రశంసలు కురిపిస్తున్నారు.కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో ప్రస్తుతం పలువురు భారత ఆటగాళ్లు ఆడుతున్నారు. కుల్దీప్ యాదవ్, అఖీబ్ నబీ, రాహుల్ చాహర్ కూడా తమ జట్ల తరపున బరిలో ఉన్నారు.భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ఇటీవల ఐదుగురు అత్యుత్తమ భారత బౌలర్ల జాబితాను వెల్లడించాడు. ఇందులో చాహల్‌కు నాలుగో స్థానం ఇచ్చాడు. భువనేశ్వర్ కుమార్‌ను తొలి స్థానంలో ఉంచాడు. మహ్మద్ షమీకి రెండో స్థానం, కుల్దీప్ యాదవ్‌కు మూడో స్థానం ఇచ్చాడు. రవిచంద్రన్ అశ్విన్‌ను ఐదో స్థానంలో ఎంపిక చేశాడు. జస్‌ప్రీత్ బుమ్రాకు ఈ జాబితాలో చోటు దక్కలేదు.భువనేశ్వర్ తన వ్యక్తిగత అభిమాన బౌలర్ అని అర్ష్‌దీప్ చెప్పాడు. కొత్త బంతితో అతడు చూపించే నియంత్రణ తనను ఎంతగానో ఆకట్టుకుంటుందని తెలిపాడు. షమీ ఏ పిచ్‌పైనైనా బంతిని సీమ్ చేయగలడని ప్రశంసించాడు. చాహల్ అద్భుతమైన రికార్డు కలిగిన బౌలర్ అని పేర్కొన్నాడు.



## సంక్రాంతి రేసులో 'కాకా'.. హైదరాబాద్‌లో భారీ షెడ్యూల్!


లటాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద మరోసారి రికార్డులను తిరగరాసేందుకు మెగాస్టార్ చిరంజీవి, మాస్ డైరెక్టర్ బాబీ (కె.ఎస్. రవీంద్ర) మరో అడుగు ముందుకు వేస్తున్నారు. వీరిద్దరి కలయికలో ఇప్పటికే వచ్చిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'వాల్తేరు వీరయ్య' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ క్రేజీ కాంబోలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కాకా' సినిమాకు సంబంధించిన కీలకమైన షూటింగ్ అప్‌డేట్‌ను చిత్రబృందం వెల్లడించింది. ఈ భారీ ప్రాజెక్ట్‌కి సంబంధించిన తదుపరి కీలక షెడ్యూల్ సెప్టెంబర్ 7వ తేదీ నుంచి హైదరాబాద్ వేదికగా ప్రారంభం కానుంది. ఈ తాజా షెడ్యూల్‌లో సినిమాలోని కొన్ని ముఖ్యమైన సన్నివేశాలతో పాటు హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లను తెరకెక్కించడానికి దర్శకుడు బాబీ ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాత వెంకట్ నారాయణ అత్యంత భారీ బడ్జెట్‌తో, ఎక్కడా రాజీ పడకుండా నిర్మిస్తున్నారు. నిర్మాణానంతర కార్యక్రమాలు మరియు షూటింగ్‌ను శరవేగంగా పూర్తి చేస్తున్న మేకర్స్, ఈ సినిమాను 2027 సంక్రాంతి కానుకగా జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి కొత్త లుక్‌లో కనిపించబోతున్న ఈ చిత్రంలో ఆయనతో పాటు నటి అనస్వర రాజన్, నివేతా పేతురాజ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## సూర్య 50వ సినిమా అదేనా..

### 'రోలెక్స్'పై హీరో క్లారిటీ, లోకేష్ కనగరాజ్ చేతికి కీలక బాధ్యత!

తమిళ స్టార్ హీరో సూర్య ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ జోష్‌లో ఉన్నారు. కథల ఎంపికలో వైవిధ్యం చూపిస్తూ, కమర్షియల్ సినిమాలతో పాటు కంటెంట్ ఓరియెంటెడ్ మూవీస్‌తోనూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఆయన.. ప్రస్తుతం భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఇటీవల 'కరుప్పు', 'విశ్వనాథ్ అండ్ సన్స్' వంటి సినిమాలతో సక్సెస్ అందుకున్న సూర్య.. తన నెక్స్ట్ సినిమాల విషయంలో మరింత జాగ్రత్తగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే వీటన్నింటికంటే ఇప్పుడు సినీ అభిమానుల దృష్టి సూర్య కెరీర్‌లో ఎంతో ప్రత్యేకమైన 50వ సినిమాపైనే ఉంది. ముఖ్యంగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో 'విక్రమ్' సినిమాలో పరిచయం చేసిన పవర్‌ఫుల్ క్యారెక్టర్ రోలెక్స్‌ను హీరోగా పెట్టి ఓ పూర్తి స్థాయి సినిమా తెరకెక్కనుందనే ప్రచారం ఎప్పటి నుంచో కొనసాగుతోంది. తాజాగా ఈ ప్రాజెక్ట్‌పై సూర్య స్వయంగా చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. కమల్ హాసన్ హీరోగా లోకేష్ కనగరాజ్ తెరకెక్కించిన 'విక్రమ్' సినిమాలో సూర్య కొద్దిసేపు మాత్రమే కనిపించారు. అయితే చివర్లో డ్రగ్ లార్డ్ రోలెక్స్‌గా ఆయన ఇచ్చిన ఎంట్రీ మాత్రం సినిమాకే హైలైట్‌గా నిలిచింది.భయంకరమైన లుక్, ఇంటెన్స్ బాడీ లాంగ్వేజ్, క్రూరమైన నటనతో సూర్య పోషించిన రోలెక్స్ క్యారెక్టర్ ప్రేక్షకులపై బలమైన ముద్ర వేసింది. సినిమా పూర్తయిన తర్వాత కూడా రోలెక్స్ పాత్రపై చర్చ కొనసాగింది. ఈ పాత్రను ఆధారంగా చేసుకుని పూర్తి స్థాయి సినిమా రావాలని అప్పటి నుంచే అభిమానులు కోరుతున్నారు. లోకేష్ కనగరాజ్ క్రియేట్ చేసిన లోకేష్ సినిమాటిక్ యూనివర్స్‌లో రోలెక్స్ పాత్రకు ఉన్న ప్రాధాన్యత కూడా ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలను మరింత పెంచింది. తాజాగా సూర్య ఈ ప్రాజెక్ట్ గురించి మాట్లాడుతూ.. లోకేష్ కనగరాజ్ ప్రస్తుతం 'రోలెక్స్' కథకు సంబంధించిన పూర్తి స్క్రిప్ట్‌ను సిద్ధం చేసే పనిలో ఉన్నారని వెల్లడించినట్లు సమాచారం.దీంతో ఇంతకాలం కేవలం ప్రచారంగా వినిపించిన 'రోలెక్స్' ప్రాజెక్ట్‌పై ఇప్పుడు మరోసారి భారీ చర్చ మొదలైంది. లోకేష్ పూర్తి స్థాయి స్క్రిప్ట్ సిద్ధం చేసి సూర్యకు వినిపించిన తర్వాతే ఈ సినిమా ఎప్పుడు పట్టాలెక్కుతుందనే విషయంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.సూర్య కెరీర్‌లో 50వ సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌ను అభిమానులు ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. అందులోనూ 'విక్రమ్'లో రోలెక్స్‌గా సూర్యకు వచ్చిన క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుంటే.. అదే పాత్రతో పూర్తి సినిమా వస్తే అంచనాలు ఏ స్థాయిలో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.అయితే సూర్య 50వ సినిమా 'రోలెక్స్'గానే ఉంటుందని ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించలేదు. సూర్య స్వయంగా చెప్పిన వివరాల ప్రకారం లోకేష్ ఈ కథను సిద్ధం చేస్తున్నారన్న విషయం మాత్రం ప్రాజెక్ట్‌పై ఆసక్తిని మరింత పెంచుతోంది.





## కృష్ణాష్టమి కానుకగా 'కృష్ణంభజే' ఫస్ట్ లుక్ విడుదల.. మార్కండేయుడిగా నటుడు బ్రహ్మాజీ!

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో భక్తి, ఆధ్యాత్మిక భావాలతో తెరకెక్కుతున్న వైవిధ్యభరితమైన చిత్రం 'కృష్ణంభజే'. జయశ్రీ మీడియా సమర్పణలో కలాల్ శ్రీనివాస్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకు నాగరాజ్ కొట్టే దర్శకత్వం వహిస్తున్నారు. పౌరాణిక మరియు భక్తిరస అంశాల సమాహారంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సంబంధించి తాజాగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ సినీ వర్గాల్లో, ప్రేక్షకులలో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ సీనియర్ నటుడు బ్రహ్మాజీ ఈ సినిమా తొలి లుక్‌ను సోషల్ మీడియా వేదికగా అధికారికంగా విడుదల చేశారు. ఈ చిత్రంలో నటుడు బ్రహ్మాజీ అత్యంత ప్రాధాన్యత కలిగిన మార్కండేయ పాత్రలో కనిపించనున్నారు. విడుదలైన పోస్టర్‌లో ఆయన అచ్చమైన సంప్రదాయ ఆధ్యాత్మిక రూపంలో దర్శనమివ్వడం విశేషం. ఒంటిపై కాషాయ వస్త్రాలు, మెడలో రుద్రాక్ష మాలలు, నుదుటిపై విభూతి రేఖలు ధరించి, చేతిలో ఆయుధంతో ఆయన కనిపించిన తీరు భక్తికి, తపస్సుకు ప్రతీకలా నిలుస్తోంది. ఎప్పుడూ విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించే బ్రహ్మాజీ, ఈ పౌరాణిక భక్తిరస చిత్రంలో పూర్తిగా భిన్నమైన గెటప్‌లో కనిపిస్తుండటంతో ఈ లుక్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రంలో కథాబలంతో పాటు ఆకట్టుకునే ప్రత్యేక సన్నివేశాలకు పెద్దపీట వేసినట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. దర్శకుడు నాగరాజ్ కొట్టే అందించిన బలమైన కథ, కథనాలతో పాటు మాటల రచయితగా వ్యవహరిస్తున్న రచ్చ రవి సంభాషణలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ సినిమాలో ప్రదీప్ హీరోగా నటిస్తుండగా, వంగమయి పటేల్ కథానాయికగా అలరించనున్నారు. వీరితో పాటు మురళీ గౌడ్, రచ్చ రవి, అభయ్ బెతిగంటి, గౌతమ్ రాజు, దయానంద్ రెడ్డి, యాదమ్మ రాజు వంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు. సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే, ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ బాధ్యతలను రాము సి.ఎం మరియు సూర్య మీసాల సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. మంథెన త్రినాథ్, సత్య సొమేష్ అందిస్తున్న సంగీతం సినిమాలోని సన్నివేశాలకు ప్రాణం పోయనుందని సమాచారం. ఎడిటర్‌గా జి. రాకేష్ గౌడ్, కొరియోగ్రాఫర్లుగా ఏ.ఆర్. బాబు మరియు బాలకృష్ణ, ఫైట్ మాస్టర్‌గా రవితేజ పని చేస్తున్నారు. శ్రీరాం గుప్త సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి పబ్లిసిటీ డిజైనర్‌గా వివరెడ్డి, పీఆర్‌ఓగా అశోక్ దయ్యాల వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ తుది దశకు చేరుకున్న నేపథ్యంలో, త్వరలోనే టీజర్‌తో పాటు ఇతర ప్రచార చిత్రాలను విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

## హీరోయిన్ల వివాదంపై తాప్సీ షాకింగ్ కామెంట్స్..

### ప్రేక్షకులనే నిందిస్తూ మేకర్స్ తప్పించుకుంటున్నారా?

సినిమాల్లో హీరోయిన్లను చూపించే విధానం మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది. ముఖ్యంగా భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన రామ్ చరణ్ 'పెద్ది' , కన్నడ స్టార్ హీరో యష్ నటించిన 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' చిత్రాల్లో మహిళా పాత్రలను ప్రెజెంట్ చేసిన తీరుపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. హీరోయిన్ల పాత్రలు, వారి లుక్, దుస్తులు, కెమెరా యాంగిల్స్ విషయంలో గ్లామర్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారనే అభిప్రాయాలు నెటిజన్ల నుంచి వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా హీరోయిన్ తాప్సీ పన్ను చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. తన తాజా చిత్రం 'గాంధారి' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన తాప్సీ.. సినిమా పరిశ్రమలో 'డిమాండ్ అండ్ సప్లై' విధానం, సోషల్ మీడియా విమర్శలు, ప్రేక్షకుల అభిరుచులపై కీలక వ్యాఖ్యలు చేసింది. సినిమాల్లో హీరోయిన్లను గ్లామర్‌గా చూపించడంపై సోషల్ మీడియాలో వచ్చే విమర్శల గురించి తాప్సీని ప్రశ్నించగా.. డిజిటల్ ప్రపంచానికి, గ్రౌండ్ లెవల్‌లో ఉన్న ప్రేక్షకుల అభిప్రాయాలకు చాలా తేడా ఉంటుందని ఆమె చెప్పింది. ముఖ్యంగా మాస్ సినిమాల విషయంలో సోషల్ మీడియాలో వచ్చే విమర్శలు సినిమాలపై పెద్దగా ప్రభావం చూపకపోవచ్చని తాప్సీ అభిప్రాయపడింది. నెట్‌లో ఎంత చర్చ జరిగినా.. అదే గ్లామర్ ఫొటోలను జూమ్ చేసి, వివిధ యాంగిల్స్‌లో వీడియోలు తయారు చేసి వైరల్ చేసే వాళ్లు కూడా సోషల్ మీడియాలోనే ఉన్నారని ఆమె పేర్కొంది. అంటే ఒకవైపు అదే కంటెంట్‌ను విమర్శిస్తూ.. మరోవైపు దానికి సంబంధించిన వీడియోలు, ఫొటోలను వైరల్ చేయడం కూడా జరుగుతోందని తాప్సీ చెప్పుకొచ్చింది. దీనిని బట్టి అలాంటి కంటెంట్‌కు సోషల్ మీడియాలో కొంత మేర ఆదరణ ఉందనే విషయాన్ని పూర్తిగా కొట్టిపారేయలేమని ఆమె అభిప్రాయపడింది. సినిమా పరిశ్రమలో ఇలాంటి పరిస్థితులు ఎందుకు వస్తున్నాయన్న దానిపై తాప్సీ తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించింది. ఇండస్ట్రీలో కూడా డిమాండ్ అండ్ సప్లై సూత్రమే పనిచేస్తుందని ఆమె చెప్పింది. ప్రేక్షకులు ఇలాంటి కంటెంట్‌ను కోరుకుంటున్నారని, దాని ద్వారా సినిమాలకు డబ్బులు వస్తాయని నిర్మాతలు, దర్శకులు భావించినప్పుడు అదే తరహా సినిమాలు, సన్నివేశాలు తెరకెక్కుతాయని తాప్సీ పేర్కొంది. అలా క్రమంగా సినిమా కథ, కళ, నటన వంటి అంశాలు వెనక్కి వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని ఆమె అభిప్రాయపడింది. కరోనా మహమ్మారికి ముందు సినీ పరిశ్రమ మంచి మార్పు దిశగా పయనించిందని తాప్సీ చెప్పింది. అయితే ప్రస్తుతం మళ్లీ కొన్ని పాత పద్ధతులు తిరిగి వస్తున్నాయని ఆమె అభిప్రాయపడింది. సినిమా ఆశించిన స్థాయిలో లేకపోతే దానికి ప్రేక్షకుల అభిరుచులను కారణంగా చూపుతూ మేకర్స్ తప్పించుకునే పరిస్థితి ఉందని తాప్సీ వ్యాఖ్యానించింది. నటీనటులు పరిశ్రమలో మార్పు కోసం ఎంత ప్రయత్నించినా.. ప్రేక్షకుల నుంచి మద్దతు లేకపోతే ఆ పోరాటంలో విజయం సాధించడం కష్టమని ఆమె చెప్పుకొచ్చింది.



I PRINTED, PUBLISHED & OWNED By M.SUNIL KUMAR at printed at Global printers #10 MIE Industrial Estate,Kallur,kurnool,Andhrapradesh.
Published from Hno: 4-86-1 New postal Colony,Balaji nagar,Kurnool,Andhrapradesh- 518003.EDITOR : M.sunil kumar, #1/339/17, sree ram nagar, bharpet,near nobel college ,ram-jal road Adoni kurnool district- 518301 Andhra Pradesh. E-mail: Suryaudhayamdaily@gmail.com